# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 3-11-2023 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 | సంపుటి :30 | సంచిక:72 | పేజీలు:6 | వెల: రూ.1/-


## హైదరాబాద్‌లో మరోసారి కలకలం రేపుతున్న ఐటీ దాడులు

హైదరాబాద్ నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: హైదరాబాద్‌లో మరోసారి ఐటీ దాడులు కొనసాగుతున్నాయి. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కే లక్ష్మారెడ్డి సహా పులవురు ఆ పార్టీకి చెందిన నేతల ఇండ్లలో ఆదాయపు పన్నుశాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. బాలాపూర్‌లోని పారిజాత నివాసంలో గురువారం ఉదయం 5 గంటల నుంచి అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆమె మహేశ్వరం ఎమ్మెల్యే టికెట్ ఆశించిన విషయం తెలసిందే. ఎమ్మెల్యే టికెట్ కోసం పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి కోట్లలో డబ్బులు ముట్టజెప్పానంటూ ప్రకటించిన సంగతి విధితమే.కాగా, మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కేఎల్ఆర్ నివాసంపై కూడా ఐటీ అధికారులు దాడులు చేస్తున్నారు. అదేవిధంగా బాలాపూర్ గణేశ్ లడ్డూను దక్కించుకున్న వంగేటి లక్ష్మారెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అదే నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతల ఇండ్లలోనూ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

## సర్కారు బడుల్లో ఆంగ్లమధ్యమం ప్రవేశం

### -పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );) : సర్కారు బడుల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలోని ప్రభుత్వ టీచర్లు ఇంగ్లిష్‌లోనే మాట్లాడాలని, ఇంగ్లిష్‌లోనే బోధించాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. అవసరాన్ని బట్టి తెలుగు, ఉర్దూలను కూడా వినియోగించాలని తెలిపింది. గత విద్యాసంవత్సరంలో 1 -8 తరగతులు, ఈ ఏడాది 9వ తరగతిలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో ఇంగ్లిష్ మీడియం చదువుల అమలుపై పాఠశాల విద్యాశాఖ సమీక్షించింది. ఇంగ్లిష్ మీడియం బోధనలో అనేక సవాళ్లు ఎదురవుతున్నట్టు విద్యాశాఖ గుర్తించింది. ముఖ్యంగా తెలుగు, ఉర్దూ మీడియం టీచర్లనే నియమించడంతో భాషేతర సబ్జెక్టులను ఇంగ్లిష్‌లో బోధించడం కష్టమవుతుందని, తరగతి గదిలో బోధన తెలుగు, ఉర్దూలోనే కొనసాగుతున్నదని గుర్తించింది. ఇక విద్యార్థులు కూడా ఇంగ్లిష్‌లో ఇచ్చిన ప్రశ్నపత్రాలను అర్థం చేసుకోలేకపోతున్నారని, ఇంగ్లిష్‌లో రాయలేకపోతున్నారని తేల్చింది. ఈ సమస్యలను అధిగమించేందుకు నిపుణులతో చర్చించి కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ఆయా మార్గదర్శకాలను పాటించాలని డీఈవోలకు సూచించింది. విద్యార్థుల పదజాలాన్ని, పఠన నైపుణ్యాలను పెంపొందించేందుకు, బహుభాషా, అనువాద పద్ధతులను అవలంబించాలని ఆదేశించింది.

### మార్గదర్శకాలు....

– 7వ తరగతి వరకు కృత్యాలు, సూచనలు, ప్రయోగాలకు, ఆటలను తెలుగు, ఉర్దూలో నిర్వహించినా.. ఇదంతా 8, 9 తరగతుల్లో పూర్తిగా ఇంగ్లిష్‌లోనే జరగాలి. ఈ విద్యార్థులు టెన్త్‌వచ్చేసరికి ఇంగ్లిష్‌వాడాలి.

–ఇంగ్లిష్ నైపుణ్యాల వృద్ధికి టీచర్లు దీక్షా పోర్టల్, ఇతర వెబ్‌సైట్ల వీడియోలను వినియోగించుకోవచ్చు.

–మౌఖిక కార్యకలాపాల ద్వారా విద్యార్థులు కాన్సెప్ట్‌ను సహేతుకంగా తెలుసుకొన్నాక, పాఠ్యాంశాలను ఇంగ్లిష్‌లో చదవడం అనుసరించాలి.

– బోధనలో బహుల భాషలు వాడాలి. ముఖ్యమైన ఇంగ్లిష్ పదాలను బోర్డుపై రాయాలి.

ఇంగ్లిష్ దినపత్రికలు, మ్యాగ్జిన్లు చదవాలి. ఇంగ్లిష్ టీవీ చానళ్లను వీక్షించాలి.

## అనుమానం వద్దు.. మళ్లీ మనమే గెలుస్తున్నాం : మంత్రి తలసాని



హైదరాబాద్, నవంబర్ 2: అనుమానమే లేదు..78 స్థానాల్లో గెలుస్తాం..మళ్ళీ అధికారంలోకి వస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్అన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సనత్‌నగర్ నియోజకవర్గంలోని మొండా డివిజన్ సాంబమూర్తి నగర్, ఆదయ్య నగర్, గ్యాస్ మండిలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఇంటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి. గ్రేటర్‌లో అన్ని స్థానాలలో బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చేసిన పనిని చెబుతాతం. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు..ఆహ్వానించిన మంత్రి ఎర్రబెల్లి

జనగామ, నవంబర్ 2: జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎన్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా తొర్రూర్ మండలం, పత్తేపురం గ్రామం కాంగ్రెస్ పార్టీకి చెందిన 3వ వార్డు మెంబర్ కాసారబోయిన మౌనిక, మాజీ వార్డ్ మెంబర్ పూజారి రాజ్ కుమార్, కాసరబోయిన సూరి బాబు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అలాగే గోపాలగిరి గ్రామానికి చెందిన డి.సందీప్ అధ్వర్యంలో 20 మంది, కొడకండ్ల మండలం పాకాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు గాజుల సుజాత, కొడకండ్ల మండలం చెరువు ముందు తండా గ్రామానికి చెందిన యువకులు తదితరులు పార్టీలో చేరు. వారికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు (ఓతినితిబబివతీ ఇతీతీజీఎవశ్రీశ్రీతి)గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే దేవరుప్పుల మండలం, రామచంద్రపురం గ్రామానికి చెందిన దోనికెల సోమయ్య, ఉపేంద్ర, ఉడుగుల భాస్కర్, లక్ష్మి, రామక్క తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

అలాగే పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు జీడి హరీష్, దేవరుప్పుల మండలం, రామోజీ గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మేడ నర్సయ్య మేడ ఎలేందర్, లకావత్ తండా గ్రామానికి చెందిన అజ్మీర భూక్య, అజ్మీర సుమన్, సీతతండా గ్రామానికి చెందిన రాజశేఖర్, ప్రకాష్, వెంకన్న, దేవుని గుట్ట తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ధారావత్ పాత్తి, భీమా, కిషన్, యాదగిరి, బిచ్య, యాదగిరి తదితరులు పార్టీలో చేరారు.

### నేటి కందం– నేటికి అందం




(3-11-1948 నెహ్రూ మొదటిసారి ఐ.రా.స.లో ప్రసంగించిన రోజు...)



-రాధశ్రీ

సెల్:9494481210

## కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే..

## ధర్మపురికి హుజూరాబాద్ తరహాలో ఒకేసారి దళితబంధు : సీఎం కేసీఆర్



ధర్మపురి, నవంబర్ 2: కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే హుజూరాబాద్ తరహాలో ఒకేసారి నియోజకవర్గం మొత్తానికి దళితబంధు పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరావు ప్రకటించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దళితబంధు తీసుకురావాలని ఎవరూ నన్ను అడుగలేదు. దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలతో మాట్లాడి పెట్టాను. ఈ సభతో ఈశ్వర్ రిజల్ట్ డిక్లేర్ అయిపోయింది.. గెలిచిపోయిండని తెలిసిపోయింది. నేను మీ అందరికీ ఒక్కటే హామీ ఇస్తున్నా. కొప్పుల ఈశ్వర్ 70–80వేల ఓట్ల మెజారిటీతో గెలవాలి. ధర్మపురి నియోజకవర్గం మొత్తానికి హుజూరాబాద్‌లో మాదిరిగా ఒకేసారి దళితబంధు పథకాన్ని మంజూరు చేయిస్తా. ప్రతి ఇంటికి కూడా దళితబంధు పథకం వస్తుంది' అని వెల్లడించారు.

'దళితబంధు ఎందుకు తీసుకువచ్చాం. తిన్నది అరగకనా? రైతుబంధుతో ఎట్లయితే రైతులను ఆదుకుంటున్నమో.. దళితబిడ్డలు, సమాజం దగా చేయబడ్డది. తరతరాల నుంచి దోపిడీకి గురైంది. అణచివేయబడ్డది. ఆ సమాజం అలా ఉండడం మనందరికీ సిగ్గుచేటు. వాళ్లు కూడా సాటి మనుషులే. వారిని ఎట్టి పరిస్థితుల్లో పైకి తేవాలని.. సమాజం బాగుపడాలని స్వయంగా ఆలోచించి తీసుకువచ్చిన పథకమే దళితబంధు. భారత దేశంలో ఏ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కూడా దళితబంధు గురించి ఆలోచన చేయాలి. దళితులను ఓటుబ్యాంకు వాడుకున్నారు తప్ప.. ఎన్నడూ చేసిన పాపానపోలేదు. సమాజంలో ప్రతి వర్గానికి పైకి తీసుకురావాలని.. చేతనైంతగా, ఉన్నంతలో అమలు చేస్తున్నది. దఫాదఫాలుగా అయినా ధర్మంగా చేయాలని రాష్ట్రల ఖజానాను ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. సంపదను పెంచుతున్నాం. పేదలకు పంచుతున్నాం. సమాజం పైకి వస్తున్నది' అన్నారు.

తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్..

'ఏదైనా రాష్ట్రం పైకి వచ్చిందా? లేదా అనడానికి ఓ గీటురాయి, కొలమానం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా చూసే కొలమానం ఏంటంటే.. ఆ దేశమైతే ఆ దేశ తలసరి ఆదాయం ఎంత? చూస్తరు. దేశంలో ఏ రాష్ట్రం తలసరి ఆదాయం ఎంత అని చూస్తారు. నేను గర్వంగా చెబుతున్నా.. తెలంగాణ వచ్చిన రోజు మన స్థానం పదిహేనో పదహారో స్థానంలో ఉండే. గతంలో లక్షలోపు తలసారి ఆదాయం ఉండే.. ఈ రోజు 3.18లక్షల తలసరి ఆదాయంతో దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నాం. తాగునీటి సరఫరా, కరెంటు, విద్యుత్ తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉన్నది. పది సంవత్సరాల చిన్న వయసే ఉన్నా.. అనేక రంగాల్లో మంచి మార్పులు తెచ్చి రాష్ట్రాన్ని బాగు చేసి ముందుకుపోతున్నాం' అన్నారు.

ధర్మపురి ఆలయ అభివృద్ధికి అవసరమైతే మరిన్ని నిధులు

'కులం, మతం అని చూడకుండా యావన్‌మంది మంది ప్రజలు మనబిడ్డలే కాబట్టి చేసుకుంటూ పోతున్నాం. ధర్మపురి ఆలయ అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరు చేసుకున్నాం. పనులు జరుగుతున్నయ్.. ఇంకా జరగాల్సి ఉంటే.. మరింత డబ్బు మంజూరు చేసుకొని అద్భుతమైన పుణ్యక్షేత్రంగా మార్చుకుందాం. మీ అందరిని కోరేది ఒకటే. కొప్పుల ఈశ్వర్ సౌమ్యుడు. కార్మికుడిగా పని చేసి పైకి వచ్చిన వ్యక్తి. ఎవరినీ ఒకమాట కూడా గట్టిగా మాట్లాడని వ్యక్తి. ఈశ్వర్‌లాంటి వ్యక్తి గెలిస్తే ధర్మపురి చాలా అద్భుతంగా ముందుకు వెళ్తుంది. కారు గుర్తుకు ఓటేసి బ్రహ్మాండమైన మెజారిటీతో ఈశ్వర్‌ను గెలిపించాలి' అని కోరారు.

## పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే.. మళ్లా పైరవీకారులు పుట్టుకొస్తరు : సీఎం కేసీఆర్

నిర్మల్, నవంబర్ 2: తెలంగాణలో పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే.. మళ్లా పైరవీకారులు పుట్టుకొస్తరు.. కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్టు అవుతుందని సీఎం కేసీఆర్ తెలిపారు. నిర్మల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.

రైతుబంధుపై ఇవాళ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాలుగా మాట్లాడుతుంది అని కేసీఆర్ పేర్కొన్నారు. రైతుబంధు పుట్టించిందే కేసీఆర్. రైతులు అంతకుముందు ఏడ్చారు. లంచాలు ఇచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్ చేయించుకున్న పరిస్థితి. ఇప్పుడు కరెంట్‌ను ఇచ్చుకున్నాం. నిర్మల్ నియోజకవర్గంలో 15 సబ్ స్టేషన్లు నిర్మించుకున్నారు. వందలాది ట్రాన్స్‌ఫార్మర్లు తెచ్చుకున్నారు. 24 గంటల కరెంట్‌తో పంటలు పండించుకుంటున్నారు అని కేసీఆర్ తెలిపారు.

రైతుల ముఖాలు కళకళలాడుతున్నాయి..

తెలంగాణ రాక ముందు కరువులతో, వలసలతో సాగు,తాగునీటి గోసలతో చెట్టుకు గుట్టకు ఒకరయ్యాం అని కేసీఆర్ గుర్తు చేశారు. గ్రామాలు పచ్చబడాలంటే ఏం చేయాలని ఆలోచించి, వ్యవసాయాన్ని స్థిరీకరించాలని నిర్ణయించాం. రైతుబంధు అనేది ఎలక్షన్ల కోసం పెట్టింది కాదు. నన్నెవరూ అడగలేదు. దరఖాస్తు పెట్టలేదు. ఎవరూ ధర్నా చేయలేదు. మా అంతట మేం ఆలోచించి ఆ స్కీం తెచ్చాం. నీటితిరువా రద్దు చేశాం. నీళ్లు, కరెంట్ ఉచితంగా ఇస్తున్నాం. రైతబంధు పెట్టుబడి కింద ఇస్తున్నాం. రైతులు పండించిన పంటను కొంటున్నాం నష్టం వచ్చినా కూడా. ఈ కార్యక్రమాల ద్వారా రైతుల ముఖాలు కళకళలాడుతున్నాయి. రైతుల రుణమాఫీ కూడా చేశాం. కొంతమందికి కావాల్సి ఉంది. కాంగ్రెసోళ్లు పిటిషన్ వేశారు. ఎన్నికలు ముగిసిన మర్నాడే ఇచ్చేస్తాం. ఎన్నికల కమిషన్ పర్మిషన్ ఇచ్చేస్తే వారం పది రోజుల్లో వచ్చేస్తది అని కేసీఆర్ పేర్కొన్నారు.

రైతులు బిచ్చగాళ్ల లాగా కనబడుతున్నారా..?

వ్యవసాయ స్థీరికరణ కోసం రైతుబంధు తెస్తే.. కేసీఆర్ పనిలేక దుబారా చేస్తున్నాడని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ధ్వజమెత్తారు. కేసీఆర్ బిచ్చమేస్తుండు అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. రైతులు బిచ్చగాళ్ల లాగా కనబడుతున్నారా..? రైతులు పండించే పంట ఎంత..? అందులో ఆయన తినేది ఎంత..? మిగతాది అంతా దేశానికే కదా ఇచ్చేది. ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ బియ్యం పోతాయి కదా అని కేసీఆర్ తెలిపారు.

ధరణి ఎత్తేస్తే.. మళ్లీ దళారీల రాజ్యమే..

కరెంట్ 24 గంటలు అవసరం లేదు.. 3 గంటలు చాలని రేవంత్ రెడ్డి అంటున్నడని కేసీఆర్ తెలిపారు. ధరణి పోర్టల్ తెచ్చాం. ఎవరి కోసం, దేని కోసం తెచ్చాం. రైతుల భూములు క్షేమంగా బ్రహ్మాండంగా ఉన్నాయి. నిశ్చితంగా ఉన్నారు రైతులు. ధరణి రాకముందు వీఆర్వో నుంచి సీసీఎల్ఏ దాకా రైతుల మీద పెత్తనం. ధరణి పోర్టల్ ఉంది కాబట్టి రైతుబంధు డబ్బులు నేరుగా వస్తున్నాయి. అదే విధంగా ధాన్యం అమ్మితే.. పైసలు నేరుగా మీ బ్యాంకులో పడుతున్నాయి. రైతుబీమా కూడా 10 రోజుల్లో జమ అవుతుంది. మరి ధరణి తీసేస్తే ఇవన్నీ ఎలా వస్తాయి. ఇప్పటిలాగా వస్తాయా..? మళ్లీ పహాని నఖలు, వీఆర్వోలు, ఎమ్మార్వో కార్యాలయాల చుట్టు తిరుగుడు. మళ్లీ పైరవీకారుల మందలు.. రైతుబంధు వస్తే నీ పేరు రాయాలంటే పంచ్ అజర్ లావో అంటడు. మళ్లీ పాతక కథనే రావాల్నా.. దళారీల రాజ్యమే రావాల్నా..? అని కేసీఆర్ ప్రశ్నించారు.

గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చాం..

ధరణి ఉండాలని, 24 గంటల కరెంట్ కావాలని ప్రజలు అంటున్నారని కేసీఆర్ స్పష్టం చేశారు. పార్టీల చరిత్ర, నడవడి గురించి మీరు ఆలోచించాలి. గిరిజన బిడ్డలు ఉన్నారు. మా తండాలో మా రాజ్యం రావాలని కొట్లాడారు. ఏ ప్రభుత్వం కూడా చేయలేదు. పట్టించుకోలేదు. కానీ మా గవర్నమెంట్‌లో ఆదివాసీ గూడెలను, గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చాం. అభివృద్ధి చేసుకుంటున్నారు. పోడు పట్టాలు ఇచ్చామని కేసీఆర్ తెలిపారు.

అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి..

అలవోకగా, తమాషాగా ఓటు వేయొద్దు.. ఆలోచన చేయాలి, చర్చ చేయాలి అని కేసీఆర్ సూచించారు. ఎవరు గెలిస్తే లాభవో ఆలోచించాలి. పొరపాటు కాంగ్రెస్ గెలిస్తే.. నేను తెలంగాణ బిడ్డగా చెప్తున్నా.. మీకు చెప్పే బాధ్యత ఉంది కాబట్టి చెప్తున్నాను. వాళ్లకు రైతుబంధు మీద ఇష్టం లేదు. కరెంట్ ఇచ్చుడు ఇస్టం లేదు. రైతుల ఖాతాలో డైరెక్ట్‌గా డబ్బులు వేసుడు ఇష్టం లేదు. మళ్లా పైరవీకారులు పుట్టుకొస్తారు. కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్టు అవుతది. జాగ్రత్తా అని మనవి చేస్తున్నా. ఈ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీ గెలిస్తేనే ఈ అభివృద్ధి నిలకడగా ముందుకు పోతది అని కేసీఆర్ తేల్చిచెప్పారు.

## తెలంగాణలో కరెంట్ కొరత రానే రాదు.. తేల్చిచెప్పిన సీఎం కేసీఆర్

నిజామాబాద్, నవంబర్ 2: తెలంగాణ రాష్ట్రంలో కరెంట్ కొరత రానే రాదు.. మిగులు రాష్ట్రంగా కాబోతున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ తేల్చిచెప్పారు. బాల్కొండ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఎన్నికల్లో నిలబడ్డ వ్యక్తి గురించే కాదు.. ఆ అభ్యర్థి వెనకున్న పార్టీ చరిత్ర చూడాలి అని కేసీఆర్ సూచించారు. అలవోకగా, ఆషామాషీగా ఓటు వేస్తే కిందమీద అవుతుంది. మంది మాటలు పట్టుకుని మారువానం పోతే మళ్లొచ్చే వరకు ఇల్లు కాలిపోయిందని అన్నట్టు ఆగమాగం అయిపోతది. కాబట్టి ఓటు చాలా విలువైంది.. దాని ప్రభావం ఐదేండ్ల భవిష్యత్‌పై ఉంటది కాబట్టి జాగ్రత్తగా వాడాలి. అన్ని వర్గాలను ఆదుకునే ప్రయత్నం చేశాం. సమస్యలన్నింటిని పరిష్కారం చేసుకున్నాం అని కేసీఆర్ తెలిపారు.

రాష్ట్రంలో ఏ మారుమూల పల్లె అయినా, ఆదిలాబాద్‌లో గోండు బిడ్డలకు కూడా మంచినీళ్లు అందుతున్నాయని కేసీఆర్ పేర్కొన్నారు.

మిషన్ భగీరథ బ్రహ్మాండంగా విజయవంతం చేసుకున్నాం. కరెంట్ సమస్య కంప్లీట్ చేసుకున్నాం. యాదాద్రి పవర్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే ఇంకో 4 వేల మెగావాట్ల విద్యుత్ మనకు వస్తుంది. మిగులు రాష్ట్రంగా కాబోతున్నాం. కరెంటో కొరత రానేరాదు. ఎవరికి రాని, ఎవడు యేట్లే పడని, గంగల పడని, తెలంగాణకు మాత్రం ఆ కొరత రాదు. రానివ్వడు కేసీఆర్ ఎట్టి పరిస్థితుల్లో అని సీఎం తేల్చిచెప్పారు.

### బీడీ కార్మికుల ఓటు ఇంకో పార్టీకి పడొద్దు..

ధరణి వచ్చాక భూముల పంచాయితీలు తగ్గాయని కేసీఆర్ చెప్పారు. నూటిలో ఒకరిద్దరికి సమస్య ఉంటే పరిష్కరిస్తాం. 17 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నారు. ఏ రాష్ట్రంలో కూడా పెన్షన్ ఇవ్వడం లేదు. కానీ తెలంగాణలో మాత్రం బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్నాం. దీని గురించి బీడీలు చుట్టే బిడ్డలు ఆలోచించాలి. ప్రభుత్వ వైఖరి, పార్టీ వైఖరి గురించి. పోటీలో ఉన్న పార్టీకి మెదడు ఎలా పని చేస్తదో, ఏమో ఆలోచిస్తదో విచారించాలి. ఏ రాష్ట్రం కూడా బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వట్లేదు. బాల్కొండ, ఆర్మూర్ ఈ ప్రాంతాల్లో బీడీ కార్మిక బిడ్డలు ఆలోచించాలి. బీడీ కార్మికులకు రేపు ఐదు వేల పెన్షన్ రాబోతోంది. మీ ఒక్క ఓటు కూడా ఇంకో పార్టీకి పడొద్దు. ఆ విధంగా కార్యకర్తలు ప్రచారం కూడా చేయాలి అని కేసీఆర్ సూచించారు.

## ఎలక్టోరల్ బాండ్ల కోసం కొత్త సిస్టమ్ డిజైన్ చేయండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 2: ఎలక్టోరల్ బాండ్లకు ప్రత్యామ్నాయంగా మరో విధానాన్ని రూపొందించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఎలక్టోరల్ బాండ్ల వ్యవస్థలో ప్రస్తుతం ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ఈ చర్య అవసరమని కోర్టు పేర్కొన్నది. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, జేబీ పర్థీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలకు వస్తున్న బాండ్ల అంశంపై దాఖలైన పిటీషన్ల గురించి ఇవాళ కోర్టు విచారణ చేపట్టింది. నగదు మాత్రమే తీసుకోవాలన్న పాత విధానాన్ని కోర్టు సూచిందని సీజే చంద్రచూడ్ తెలిపారు. కానీ ప్రస్తుత బాండ్ల వ్యవస్థలో ఉన్న లోపాల్ని సవరించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే పార్లమెంట్ చట్టం ద్వారానే ఆ మార్పును తీసుకువచ్చేందుకు అవకాశం ఉందని, కోర్టు ఆ కోణంలో జోక్యం చేసుకోలేదన్నారు. ఎలక్టోరల్ బాండ్ల కోసం కొత్త సిస్టమ్‌ను డిజైన్ చేయాలని ధర్మాసనం అభిప్రాయపడింది.

## తెలంగాణ ఎన్నికల బీజేపీ మూడో జాబితా విడుదల

హైదరాబాద్ నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ ఎన్నికలకు సంబంధించి బీజేపీ గురువారం మూడో జాబితాను విడుదల చేసింది అంబర్‌పేట నియోజకవర్గం నుంచి కృష్ణ యాదవ్ బరిలో ఉన్నారు. మొత్తం 35 మందితో మూడో లిస్ట్‌ను బీజేపీ హై కమాండ్ విడుదల చేసింది. ఈ జాబితాలో ఎస్సీ 5, ఎస్టీ 3 మందికి చోటు కల్పించారు. ఇక ఇప్పటికే రెండు జాబితాలల్లో మొత్తం 53 మందిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక మూడో జాబితాలో అందోల్ నుంచి బాబుమోహన్, బాన్సువాడ నుంచి యెండల లక్ష్మీనారాయణ, ఉప్పల్ నుంచి ఎన్‌వీఎస్ ప్రభాకర్‌కు చోటు దక్కింది. థర్డ్ లిస్టులో కూడా బండారు దత్తాత్రేయ కుమార్తెకు మొండి చెయ్యి ఎదురైంది. అలాగే కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, నాంపల్లి, కంటోన్మెంట్, మల్కాజ్‌గిరి స్థానాలను బీజేపీ నాయకత్వం పెండింగ్‌లో పెట్టింది. జనసేనకు కూడా కొన్ని సీట్లు కేటాయించే అవకాశం ఉంది. దీనిపై ఇంకా క్లారిటీ రాలేదు.

### అభ్యర్థులు వీరే..

ఆసిఫాబాద్–అజ్మీరా ఆత్మారామ్ నాయక్
బాన్సువాడ–యెండల లక్ష్మీనారాయణ
మంథని–చందుపట్ల అనిల్‌రెడ్డి
బోధన్–వడ్డి మోహన్‌రెడ్డి
అంబర్‌పేట – కృష్ణాయాదవ్
సికింద్రాబాద్ – మేకల సారంగపాణి
జూబ్లీహిల్స్ – లంకల దీపక్‌రెడ్డి
ముషీరాబాద్ – పూస రాజు
పరిగి– మారుతీ కిరణ్
రాజేంద్రనగర్– తోకల శ్రీనివాసరెడ్డి
ఉప్పల్ – ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్
ఎల్బీనగర్ – సామరంగారెడ్డి
సనత్‌నగర్ – మర్రి శశిధర్ రెడ్డి.

## నేడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

### -అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం
### -ఇతర రాష్ట్రాల ఐఏఎస్, ఐపీఎస్‌లను పరిశీలకులుగా నియమించిన కేంద్ర ఈసి

హైదరాబాద్ నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల ఐఏఎస్, ఐపీఎస్ అధికారలను ఎన్నికల పరిశీలకులుగా కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. సాధారణ పరిశీలకులుగా 67 మంది ఐఏఎస్ అధికారులు, 39 మంది ఐపీఎస్ అధికారులను పోలీస్ పరిశీలకులుగా నియమించింది. వీరంతా ఈ నెల 10 నుంచి రంగంలోకి దిగనున్నారు.ఎన్నికల నోటిఫికేషన్ రేపు విడుదల కానుంది. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నామినేషన్లు ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 5న ఆదివారం సెలవు కావడంతో నామినేషన్లు స్వీకరించరు. ఈ నెల 10న నామినేషన్ల గడువు ముగియనుంది. 13వ తేదీన అభ్యర్థుల నామినేషన్లను పరిశీలిస్తారు. 15వ తేదీ వరకు నామినేషన్ ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అదే రోజు తుది జాబితాను ప్రకటిస్తారు. ఈ నెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. డిసెంబర్ 3న ఫలితాలు వెలువడుతాయి.

## పోటీ చేసే అభ్యర్థుల కోసం ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు విడుదల

### -ప్రతిపాదించే వ్యక్తులు లేకపోతే వారి నామినేషన్ తిరసరణకు గురవుతుంది
### -ప్రతిపాదించే వ్యక్తులకు అభ్యర్థి పోటీ చేస్తున్న నియోజకవర్గంలో ఓటు హక్కు లేకపోయినా వారి ప్రతిపాదన చెల్లదు
### -గుర్తింపు పొందని పార్టీ నుంచి లేదా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే వారు అదే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి.

హైదరాబాద్, నవంబర్ 2 (ఎక్స్‌ప్రెస్ న్యూస్ );): తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో.. పోటీ చేసే అభ్యర్థులకు ఎలక్షన్ కమిషన్ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఎమ్మెల్యేగా గెలుపొందిన కొందరిపై వారి ప్రత్యర్థులు నియమావళిని పాటించలేదని ఆరోపిస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నియమావళిని విడుదల చేసింది. అభ్యర్థులు నామినేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అందులో పొందుపరిచింది.

### ఈ నిబంధనలు తప్పనిసరి పాటించాలి

– నామినేషన్ వేసే అభ్యర్థి గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీకి చెందిన వారైతే సదరు అభ్యర్థిని అదే నియోజకవర్గానికి చెందిన ఒక ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుంది.

గుర్తింపు పొందని పార్టీ నుంచి లేదా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే పక్షంలో అదే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి.

– ఓటు హకు ఉన్న నియోజకవర్గం నుంచి కాకుండా మరో స్థానం నుంచి పోటీ చేయాలనుకుంటే తనకు ఓటు హకు ఉన్నట్టు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి.

– ఒకో అభ్యర్థి ఒకో నియోజకవర్గం నుంచి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయొచ్చు.

–ఎన్నికలకు సంబంధించిన ప్రతి పైసా ఈ ఖాతా నుంచే ఖర్చు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో జాయింట్ అకౌంట్ తెరవొద్దు. అభ్యర్థి ఒకరి పేరుతో మాత్రమే ఖాతా ఉండాలి.

–ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఆయా వర్గాలకు చెందిన వారై ఉండాలి. ఈ మేరకు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.

–ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 4, 5 ప్రకారం జనరల్ క్యాటగిరీ నియోజకవర్గాల నుంచి కూడా పోటీ చేయొచ్చు.

–అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి.

ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి.

–నామినేషన్ సమయంలో నోటరీ చేసిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి ఆస్తులు, అప్పులు, కేసులు వంటి అన్ని వివరాలూ ఉండాలి.

–నామినేషన్ సమయంలో రిటర్నింగ్ అధికారి అడిగే ఏ ధ్రువపత్రాన్నైనా సమర్పించలేని పక్షంలో వాటిని అందించేందుకు తుది గడువు వరకు సమయం ఉంటుంది.

–నామినేషన్లు వేసేటప్పుడు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోపు ఊరేగింపులకు అనుమతి ఉండదు.

ఆ 100 మీటర్ల దూరంలోకి 3 వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

–రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అభ్యర్థి సహా ఐదుగురు మాత్రమే వెళ్లడానికి అనుమతి ఉంటుంది.

–నామినేషన్ పరిశీలించేటప్పుడు అభ్యర్థి, ఎలక్షన్ ఏజెంట్, అభ్యర్థిని ప్రతిపాదించిన వ్యక్తుల్లో ఒకరు, మరొక వ్యక్తి ఎవరైనా వెళ్లొచ్చు. న్యాయవాదిని కూడా తీసుకెళ్లవచ్చు.

–అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించే, అర్హత నిర్ణయించే అధికారం రిటర్నింగ్ అధికారికి మాత్రమే ఉంటుంది.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతిపాదించే వ్యక్తులు లేకపోతే వారి నామినేషన్ తిరసరణకు గురవుతుంది.

అలాగే ప్రతిపాదించే వ్యక్తులకు అభ్యర్థి పోటీ చేస్తున్న నియోజకవర్గంలో ఓటు హకు లేకపోయినా వారి ప్రతిపాదన చెల్లదు.

# రాష్ట్రంలో అభివృద్ధి జరుగలేదా!

## –కాంగ్రెస్, బీజేపి పార్టీ నేతలపై మండిపడ్డ కేటీఆర్

కామారెడ్డి నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) : తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదంటున్న కాంగ్రెస్, బీజేపి పార్టీ నేతలపై మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు 55 ఏళ్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ పార్టీ ఏం అభివృద్ధి చేసిందని నిలదీశారు. బుధవారం కామారెడ్డి నియోజకవర్గంలోని బిక్నూర్ మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో జరిగిన సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. సభలో మంత్రి ఏమన్నారో ఆయన మాటల్లోనే.. ‘కామారెడ్డిలో రోడ్లు, తాగునీళ్లు, సాగునీళ్ల గురించి షబ్బీర్ అలీ మాట్లాడుతున్నడు. అంతకుముందు 55 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఏం అభివృద్ధి చేసింది. కేసీఆర్ సీఎం అయినంకనే తెలంగాణలో అన్ని నియోజకవర్గాలతోపాటు కామారెడ్డి అభివృద్ధి చెందింది. రైతులకు, పేదలకు, మహిళలకు సంక్షేమ పథకాలు అందుతున్నయ్. ఇంత చేస్తున్నా ఏం అభివృద్ధి చేసిండ్రని అడిగే కాంగ్రెసోనికి, బీజేపోనికి సిగ్గుండాలె. రైతుబంధును బిచ్చం అని రేవంత్ రెడ్డి ఎగతాళి చేస్తుండు. రైతులను బిచ్చగాళ్లతో పోల్చిన రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలి. రైతు బంధుతో ప్రజాధనం వృథా అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అంటున్నడు. వీళ్ల మాటలు చూస్తే ఏమనిపిస్తుంది..? పుసుక్కున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు మేలు చేసే పథకాలను తీసేసినా తీసేస్తరు. అయినా తెలంగాణ కాంగ్రెసోళ్లకు చేతగాక పక్క రాష్ట్రం నుంచి డీకే శివకుమార్ అనే నాయకుడిని తెచ్చుకుంటున్నరు. బక్క పలచని కేసీఆర్‌ను ఓడించనీకి పక్క రాష్ట్రపోడు కావాల్నట. మన రాష్ట్రంలో ఎన్నికలకు డీకే శివకుమార్ ఎందుకు..? రాహుల్‌గాంధీ ఎందుకు..? ప్రధాని మోదీ ఎందుకు..? అమిత్ షా ఎందుకు..?’ అని ప్రశ్నించారు.‘నవంబర్ 9న కేసీఆర్ నామినేషన్ వేసిన తర్వాత కామారెడ్డిలో భారీ బహిరంగ సభ జరుగనుంది. ఆ సభను అందరూ కలిసికట్టుగా జయప్రదం చేయాలి. కేసీఆర్‌ను గెలిపిస్తే సిలిండర్ ధర రూ.500 అయితది. ఇప్పుడు రూ.2000 ఉన్న పెన్షన్ రూ.5000 అయితది. ఈ సంగతి నాకే కాదు మీకు కూడా తెలుసు. కాబట్టి మీరంతా ప్రజల మధ్యకు పోయి కేసీఆర్ గెలుపు కోసం కృషి చేయాలి. స్వాతిముత్యం సినిమాలో ఉద్యోగం కోసం కమల్‌హాసన్.. సోమయాజులు వెంటపడ్డట్టు మీరంతా ఓట్ల కోసం ప్రజల వెంట పడాలి. కేసీఆర్‌ను కామారెడ్డిలో భారీ మెజారిటీతో గెలిపించాలి’ అని మంత్రి పిలుపునిచ్చారు.‘మనిషి పుట్టిన దగ్గరి నుంచి చచ్చిపోయేదాకా ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. హనుమంతుడి గుడిలేని ఊరు ఉంటుందేమోగానీ, కేసీఆర్ పథకం లేని ఇళ్లు లేదు. బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి జీవిత బీమా సౌకర్యం కల్పిస్తం. తెల్ల రేషన్ కార్డుదారులందరికీ అన్నపూర్ణ స్కీమ్ కింద సన్న బియ్యం అందజేస్తం. అర్హురాలైన ప్రతి మహిళకు సౌభాగ్య లక్ష్మి పథకం కింద నెలకు రూ.3000 ఇస్తం’ అని మంత్రి కేటీఆర్ చెప్పారు.తెలంగాణ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కాంగ్రెసోనికి, బీజేపోనికి కర్రుకాల్చి వాతపెట్టాలి. కామారెడ్డిలో కేసీఆర్ గెలిస్తే ఇక్కడి భూముల ధరలు భారీగా పెరుగుతయ్. పరిశ్రమలు వస్తయ్. అనేక రకాల వసతులు ఏర్పడుతయ్. కేసీఆర్ కామారెడ్డికి వస్తున్నదే నియోజకవర్గ అభివృద్ధికి. గంపన్న కోరిక మేరకే ఆయన ఇక్కడికి వస్తున్నరు. బీజేపోడు ఒకడు ఇక్కడి భూములు గుంజుకునేందుకే కేసీఆర్ కామారెడ్డికి వస్తున్నడు అంటున్నడట. అనుంటి బేకార్‌గాళ్ల మాటలు నమ్మవద్దు. కేసీఆర్‌ను బంపర్ మెజారిటీతో గెలిపించి అలాంటోళ్లకు బుద్ధి చెప్పాలి. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలి’ అని మంత్రి సూచించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టులో బయటపడిన మరో లోపం

## –కలకలం రేపుతున్న అన్నారం సరస్వతి బ్యారేజీకి లీకేజీలు

జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాళేశ్వరం ప్రాజెక్టులో మరో లోపం బయటపడింది. అన్నారం సరస్వతి బ్యారేజీకి లీకేజీలు కలకలం రేపుతున్నాయి. బ్యారేజీలో 28, 38 నంబర్ గల రెండు గేట్ల వద్ద లీకేజీతో నీరు ఉబికి వస్తోంది. దీంతో ఇంజనీరింగ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇసుక సంచులు వేసి ఊటలను నిలువరించే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం బ్యారేజీలో నీరు 5.71 టీఎంసీలు ఉంది. ఒక గేటు ఎత్తి అధికారులు 2357 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా 10.87 టిఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో అన్నారం సరస్వతి బ్యారేజ్‌ను నిర్మించడం జరిగింది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ డ్యామేజ్ ఘటన మరిచిపోకముందే అన్నారం సరస్వతి బ్యారేజ్ లీకేజీ కలకలం రేపుతోంది.

# వృద్ధులు,వికలాంగులకు రెడ్ క్రాస్ ఉచిత వైద్య శిబిరం




హైదరాబాద్ నవంబర్ 2(ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు పి వీరమణి ఆధ్వర్యంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు వికలాంగులకు మరియు ట్రాంజెండర్ లకు మొబైల్ మెడికేర్ యూనిట్ లో భాగంగా చార్మినార్, పెట్లబుర్జ్, ఏ. పీ ఎం. డబ్ల్యూ. ఎస్ నైట్ షెల్టర్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రవి హీలియస్ హాస్పిటల్ ఎండి డాక్టర్ బి. విజయభాస్కర్ గౌడ్ వృద్ధులకు వైద్య పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా శాఖ హెల్త్ కన్వీనర్ డాక్టర్ బి శ్రీదేవి, హైదరాబాద్ డివిజనల్ కన్వీనర్ ధర్మతేజ, హైదరాబాద్ జిల్లా శాఖ ప్యాట్రన్ సభ్యులు సుప్రభా, డా. హరిప్రియ, సువర్ణ, స్వర్ణ, స్టాఫ్ నర్స్ లావణ్య, మహేష్, ఏపీ లక్ష్మి, వెంకట్ ,మురళి గోపాల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఉద్యమకారులకు ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్స్ కేటాయించాలి

## –తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి డిమాండ్



హైదరాబాద్ నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న అర్హులైన ఉద్యమకారులకు ఎన్నికల్లో పోటీచేయడానికి అన్ని రాజకేయ పార్టీ లు టికెట్స్ కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి డిమాండ్ చేసింది. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్.కె. గార్డెన్స్ లో ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది.ఈ సమ్మేళనం లో రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణా ఉద్యమకారులు పాల్గొన్నా రు. ఈ సంగార్భంగా నేతలు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రము ఏర్పాటు కోసం తమ ప్రాణాలను సహితం లెక్కచేయకుండా పోరాటం చేసామని తీరా రాష్ట్రము ఏర్పడ్డ తర్వాత అన్ని రాజకేయ పార్టీ లు ఉద్యమకారులను విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేసారు.

# భారత నావికాదళం బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: బంగాళాఖాతంలోని యుద్ధనౌక నుంచి సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ను భారత నావికాదళం బుధవారం విజయవంతంగా పరీక్షించింది. కార్యాచరణ సంసిద్ధత కోసం జరిపిన టెస్ట్ ఫైరింగ్ సకాలంలో లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకుంది. ఇండియన్ నేవీకి చెందిన తూర్పు కమాండ్‌లోని బంగాళాఖాతంలో ఫైరింగ్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. ఆర్–క్లాస్ డిస్ట్రాయర్ షిప్, దాని ఆయుధాలు పూర్తిగా దేశీయంగా తయారై ఆత్మనిర్భర్ భారత్‌కు, సముద్రంలో భారత నేవీ ఫైర్ పవర్‌కు సంకేతంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా చైనా పీఎల్ఏ నేవీ నుంచి ఎదురయ్యే ప్రతికూలతలతో సహా అన్ని సవాళ్లను ఇవి సమర్థవంతంగా ఎదుర్కోనున్నాయి.

సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు

బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఉన్నతాధికారుల సమాచారం ప్రకారం, భారత్–రష్యా సంయుక్త వెంచర్‌గా సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిని జలాంతర్గాములు, నౌకలు, విమానాలు, ల్యాండ్ ప్లాట్‌ఫాం నుంచి 2.8 మ్యాక్ వేగంతో, దాదాపు మూడు రెట్ల ధ్వని వేగంతో ప్రయోగించవచ్చు. ఫిలిప్పీన్స్ వంటి కొన్ని దేశాలకు కూడా బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఎగుమతి చేస్తోంది.

# సీఐడీ బెయిల్ కండిషన్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ ఏపీ హైకోర్టు

అమరావతి నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మధ్యంతర బెయిల్ కండిషన్స్‌పై సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును ఏపీ హైకోర్టు రిజర్వ్ చేసింది.

సీఐడీ పిటిషన్‌పై ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా... చంద్రబాబు తరపు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. ఎల్లుండి అంటే నవంబర్ 3న ఆర్డర్స్ ఇస్తామని న్యాయమూర్తి తెలిపారు.

**చంద్రబాబు తరపు వాదనలు:**

“కోర్టు ఆర్డర్ ఎక్కడా చంద్రబాబు అతిక్రమించ లేదు. చంద్రబాబు మాట్లాడటం అనేది ఆయన ప్రాథమిక హక్కులలో భాగమే తప్ప అతిక్రమణ కాదు. జైలు శిక్ష పడిన వారికి కూడా మీడియాతో మాట్లాడే అవకాశం గతంలో కోర్టుకు కల్పించాయి. సీఐడీ చెబుతున్న షరతులు ఆయన్ని హక్కులు హరించే విధంగా ఉన్నాయి. కేసు దర్యాప్తుపై ఎటువంటి ప్రభావం చూపుతుందో సీఐడీ అధికారులు చెప్పలేకోతున్నారు” అంటూ కోర్టుకు బాబు లాయర్లు తెలిపారు.

**సీఐడీ వాదనలు:**

జైలు నుంచి బయటకు వచ్చి చంద్రబాబు మీడియాతో మాట్లాడారంటూ ఆ వీడియో క్లిప్పింగ్స్ పెన్ డ్రైవ్‌లో కోర్టుకి సీఐడీ ఇచ్చింది. కోర్టు ఆర్డర్ ఉన్న తర్వాత కూడా చంద్రబాబు మీడియాతో మాట్లాడారని కోర్టుకు చెప్పింది.

13 గంటల పాటు జైలు నుంచి రాజమండ్రి నుంచి ర్యాలీగా చంద్రబాబు విజయవాడ వచ్చారన్నారు. ర్యాలీ లు నిర్వహించ వద్దని కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పిన చేశారని కోర్టుకు సీఐడీ తెలిపింది. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# యునైటెడ్ కింగ్‌డమ్‌లో రెండు రోజులపాటు జరిగే

# “ కృత్రిమ మేధ భద్రత సదస్సు 2023”లో మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ, నవంబర్ 2:నవంబర్ 1–2, 2023 న యునైటెడ్ కింగ్‌డమ్ లోని బకింగ్‌హామ్‌షైర్‌లోని బ్లెట్చ్లీ పార్క్‌లో జరగనున్న “కృత్రిమ మేధ భద్రత సదస్సు 2023”లో పాల్గొనేందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి ఉ వ్యవస్థాపకత మరియు ఎలక్ట్రానిక్స్ ఉ ఐటీ శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ సిద్ధమయ్యారు. యూ కే ప్రభుత్వం నిర్వహించే ఈ రెండు రోజుల సదస్సు యూ కే , యూ ఎస్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండొనేషియా, ఐర్లాండ్, ఇటలీ, కెన్యా, సౌదీ అరేబియా, నెదర్లాండ్స్, దక్షిణ కొరియా, ఇతరులతో సహా వివిధ దేశాల మంత్రులు మరియు ప్రతినిధులను ఒకచోట చేర్చుతుంది.

సదస్సు లో ప్రముఖ ప్రపంచ మేధో వర్గాలు, కృత్రిమ మేధలో ప్రత్యేకత కలిగిన ప్రఖ్యాత విద్యాసంస్థలు మరియు భావసారూప్యత గల దేశాల ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొంటారు.

మొదటి రోజు ప్లీనరీ సెషన్‌లో శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ హాజరై ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగం భారతదేశం యొక్క విధానం మరియు దాని పౌరుల జీవితాలను మెరుగుపరచడానికి కృత్రిమ మేధ యొక్క పరివర్తన సామర్థ్యాన్ని ఉపయోగించుకునే నిబద్ధతపై దృష్టి పెడుతుంది, అదే సమయంలో వినియోగదారు హానిని సమర్థవంతంగా పరిష్కరించడం మరియు నష్టాలను తగ్గించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

వినియోగదారుల హానిని నిరోధించే యంత్రాంగంతో కూడిన సురక్షితమైన విశ్వసనీయమైన మరియు జవాబుదారీ ఇంటర్నెట్ యొక్క ప్రాముఖ్యత గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గతంలో నిర్దేశించిన దృక్కోణాన్ని మంత్రి నొక్కిచెప్పారు. కాపలాదారులను ఏర్పాటు చేయాలనే భారతదేశ విధాన రూపకల్పన సూత్రానికి అనుగుణంగా, అధ్యక్షుడు బిడెన్ సోమవారం ‘సురక్షితమైన, భద్రమైన మరియు నమ్మదగిన కృత్రిమ మేధపై ఒక ముఖ్యమైన కార్యనిర్వాహక ఉత్తర్వును జారీ చేశారు, ఈ విషయంలో తమ విధాన దిశను సారూప్యత కలిగిన దేశాలు ఆమోదిస్తున్నాయని నొక్కిచెప్పారు.

శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ “అధునాతన కృత్రిమ మేధ ప్రమాదాలు” సంబంధించిన చర్చలలో కూడా పాల్గొంటారు, “అధునాతన కృత్రిమ మేధ దుర్వినియోగం నుండి ప్రపంచ భద్రతకు ప్రమాదాలు” అనే అంశంపై ప్రత్యేక దృష్టి పెడతారు. ఈ చర్చలు బయోసెక్యూరిటీ మరియు సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన చిక్కులతో సహా ఇటీవలి మరియు తదుపరి తరం అధునాతన కృత్రిమ మేధ మోడల్‌లకు సంబంధించిన భద్రతా ప్రమాదాలను పరిశీలిస్తాయి. శిఖరాగ్ర సమావేశం యొక్క రెండవ రోజున, సారూప్య దేశాల మధ్య కృత్రిమ మేధ కోసం సహకార చట్రం ఏర్పాటుకు సంబంధించిన చర్చలకు మంత్రి సహకరిస్తారు. తప్పుడు సమాచారం మరియు ఎన్నికల భద్రత వంటి రంగాలలో కృత్రిమ మేధ ప్రమాదాలకు సంబంధించిన భారతదేశ దృక్పథాన్ని ఆయన వెలుగులోకి తెస్తారు.

శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ “ ప్రగతి కోసం కృత్రిమ మేధ “ అనే అంశం పై కేంద్రీకృతమై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన సహచరులతో అర్థవంతమైన సంభాషణలలో పాల్గొంటారు. గత తొమ్మిదేళ్లుగా విశేషమైన వృద్ధిని సాధించిన భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంలో కృత్రిమ మేధ గతి చోదక శక్తిగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పరిగణించే దార్శనికతను కూడా ఆయన నొక్కిచెబుతారు.

గతంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, మంత్రి ఇలా పేర్కొన్నారు, “కృత్రిమ మేధ, ఇతర సాంకేతిక పరిజ్ఞానం వలె మార్పు తెస్తుంది, అలాగే నేరస్థులు కూడా దీనిని దుర్వినియోగం చేయవచ్చు. ఫలితంగా, మేము కృత్రిమ మేధతో సహా అన్ని అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల కోసం ఒక చట్రం అయిన డిజిటల్ ఇండియా చట్టాన్ని రూపొందించాము అలాగే సాంకేతికతను ఏ ఉద్దేశానికైనా ఉపయోగించుకోవచ్చు కానీ హాని కలిగించకూడదు అనే సూత్రాన్ని ఏర్పాటు చేసాము. 2025–2026 నాటికి, కనీసం 1 బిలియన్ కంటే ఎక్కువ మంది భారతీయులు ఆన్‌లైన్‌లో ఉంటారు. కాబట్టి, సోషల్ మీడియాలో కృత్రిమ మేధ దుర్వినియోగం నుండి వారందరూ సురక్షితంగా ఉండేలా చూసుకోవడం మా బాధ్యత.

బకింగ్‌హామ్‌షైర్‌లోని బ్లెట్చ్లీ పార్క్ చారిత్రాత్మకంగా ముఖ్యమైన ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది, ఎందుకంటే ఇది రెండవ ప్రపంచ యుద్ధం కోడ్–బ్రేకింగ్ కార్యకలాపాలకు స్థావరంగా ఉంది.

### ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతి సందర్భంగా

# లక్నోలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నాయకత్వంలో ఐక్యతా పరుగు

న్యూఢిల్లీ, నవంబర్ 2:ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతి సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నాయకత్వంలో ఐక్యతా పరుగు నిర్వహించింది. 2023 అక్టోబర్ 31న జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ రాజ్‌నాథ్ సింగ్ హజ్రత్‌గంజ్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ప్రతిమ నుంచి 1.5 కిలోమీటర్ల మేర జరిగిన ఐక్యతా పరుగును జెండా ఊపి ప్రారంభించారు.కేడీ సింగ్ బాబు స్టేడియం వరకు సాగిన పరుగులో పాఠశాల విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్లు, క్రీడాకారులు, ఔత్సాహికులు, హెచ్ఏఎల్ సిబ్బందితో సహా వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైన వారితో ‘జాతీయ ఐక్యతా దినోత్సవం’ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ స్వాతంత్ర్యానికి, దేశ నిర్మాణానికి దోహదవడిన వారిని స్మరించుకోవడానికి జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ‘ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్’ నిర్మాణానికి కృషి చేయడానికి ప్రజలకు జాతీయ ఐక్యతా దినోత్సవం అవకాశం కల్పిస్తుందని ఆయన అన్నారు.

స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పోషించిన పాత్రను రక్షణ శాఖ మంత్రి వివరించారు. స్వతంత్ర భారతదేశంలో రాచరిక రాష్ట్రాలను విలీనం చేయడంలో పటేల్ దృఢ సంకల్పంతో పనిచేశారని అన్నారు. విలీన సమయంలో సర్దార్ పటేల్ అబ్బుతమైన దౌత్య నైపుణ్యాలు ప్రదర్శించారని తెలిపిన శ్రీ శ్రీ రాజ్‌నాథ్ సింగ్ భారత సివిల్ సర్వీసెస్ వ్యవస్థ నిర్మాణం వంటి ఇతర అంశాల్లో కీలక పాత్ర పోషించారని అన్నారు. . “సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి భారతదేశ ఐక్యత, సమగ్రతను నిర్ధారించింది. 2014లో శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది.” అని మంత్రి అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించి మేరా యువ భారత్ కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గోవాలని యువతకు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పిలుపు ఇచ్చారు. ‘మేరా యువ భారత్ అభియాన్’ కార్యక్రమంలో పాల్గొని దేశాభివృద్ధికి యువత తమ వంతు కృషి చేయాలని అన్నారు. జాతీయ సమగ్రత,ఐక్యత కోసం కృషి చేయాలని అన్నారు.

గుజరాత్‌లోని కెవాడియాలో ప్రపంచంలోనే అతిపెద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ‘స్టాట్యూ ఆఫ్ యూనిటీ ని నెలకొల్పిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని రక్షణ శాఖ మంత్రి అభినందించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ భారతదేశ ఐక్యతకు ప్రతీక అని, జాతీయ సమైక్యత సందేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన కృషి యువతకు స్ఫూర్తిదాయకం అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు శ్రీ కేశవ్ ప్రసాద్ మౌర్య ఉ శ్రీ బ్రజేష్ పాఠక్, ఉత్తరప్రదేశ్ మంత్రులు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సిబి అనంతకృష్ణన్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సిబ్బంది, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఇతర అధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు.

రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న రక్షణ ఉత్పత్తి, పరిశోధన అభివృద్ధి సంస్థలు,, డిఫెన్స్ రీసెర్చ్ ఉ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్), బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ), ఇండియన్ కోస్ట్ గార్డ్ , డైరెక్టరేట్ జనరల్ డిఫెన్స్ ఎస్టేట్‌లోని వివిధ విభాగాలు ‘ రన్ ఫర్ యూనిటీ’ , జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా 160కి పైగా ప్రదేశాలలో ‘రాష్ట్రీయ ఏక్తా దివస్’ ప్రతిజ్ఞ ను నిర్వహించాయి.

# ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకోవడమే మా లక్ష్యం - జగన్



అమరావతి, నవంబర్ 2: నీటి పారుదల రంగంపై సదస్సు జరగడం శుభపరిణామం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్ సెంట్రల్ వాటర్ కమిషన్, ఏపీ జల వనరుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐసీఐడీ కాంగ్రెస్ ప్లీనరీని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ ప్రతినిధులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.ఏపీలో సాగునీటి రంగం, వ్యవసాయంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం జగన్ అన్నారు. ఏపీకి విస్తారమైన తీర ప్రాంతం ఉంది. ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకోవడమే లక్ష్యం. రాయలసీమ, దక్షిణ కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో తరచూ కరవు వస్తోంది. వర్షం కురిసేది తక్కువ కాలమే.. ఆ నీటిని సంరక్షించుకుని వ్యవసాయానికి వాడుకోవాలి. సదస్సు నిర్వహణకు ఏపీకి అవకాశం ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నాం” అని సీఎం జగన్ పేర్కొన్నారు..

నేటి నుంచి విశాఖ వేదికగా వారం రోజుల పాటు సాగనున్న అంతరాతీయ సమావేశాలలో సుమారు 90 దేశాల నుంచి ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు హాజయ్యారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ,రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా ఇంఛార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఐసీఐడీ ప్రెసిడెంట్ డా. రగబ్ రగబ్, ఐసీఐడీ వైస్ ప్రెసిడెంట్ కుష్వీందర్ వోహ్రా, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశి భూషణ్ కుమార్, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ధనుంజయ్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ హరి కిరణ్, జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు..

# బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించింది

హైదరాబాద్, నవంబర్ 2:(నేటినిజం ప్రతినిధి) బీఆర్ఎస్ అధికారంలో వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ గురువారం మండలంలోని ఆల్లంపల్లి, గోండుగూడ అల్లంపల్లి తండా,గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు డప్పు చప్పుల్లా మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారెంటీలను,మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నేరవేర్చకపోవడం సిగ్గుచేటని అన్నారు. రైతు బంధు పథకం పేద రైతులకు శాపంగా మారిందన్నారు. రైతుబంధు పథకం వల్ల భూస్వాములు లాభపడుతున్నాడని అన్నారు. ధరణి పోర్టల్ ద్వారా పేద ప్రజల భూములను ప్రభుత్వం లాక్కుందని ఆరోపించారు.

# ప్రభుత్వ విజయాలను పార్టీలు వ్యక్తిగత ప్రచారానికి వాడుకోవద్దు- సీఎం నితీష్ కుమార్

పట్నానవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బిహార్ ప్రభుత్వ విజయాలను పార్టీలు వ్యక్తిగత ప్రచారానికి వాడుకోవద్దని సీఎం నితీష్ కుమార్ కోరారు. బిహార్ స్టేట్ పవర్ (హోల్డింగ్) కంపెనీ లిమిటెడ్ 11వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం రూ.14 వేల కోట్ల విలువైన విద్యుత్ ప్రాజెక్టులను ఆవిష్కరించిన ఆయన ఏడు పార్టీలతో కూడిన మహాఘట్ బంధన్ కూటమిపై కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మిత్ర పక్షంలో కొందరు ప్రభుత్వ విజయాలను తమ పార్టీల క్రెడిట్ చెప్పుకుంటున్నారని ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ.. “కేబినెట్ లోని కొందరు మంత్రుల్ని నేను గమనించాను. ప్రభుత్వం చేసిన మంచి పనిని వారి పార్టీకి లబ్ది చేకూర్చేలా మార్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. నేను బీహార్‌లో ఏదైనా మంచి పని చేస్తే వ్యక్తిగత విజయంగా ఎప్పుడూ మాట్లాడలేదు. ఈ విషయాన్ని మంత్రులంతా గుర్తుంచుకోవాలి. పార్టీలు లబ్ధి పొందాలని చూడకుండా ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాలి” అని అన్నారు. బిహార్ కేబినెట్ లో పలువురు రాష్ట్రీయ జనతాదళ్, కాంగ్రెస్ సభ్యులు మంత్రులుగా ఉన్నారు. బీజేపీతో తెగదింపుల తరువాత నితీష్ మహాఘట్ బంధన్ పేరుతో ప్రభుత్వాన్ని కొనసాగించారు. వారు ప్రభుత్వ విజయాలను పార్టీల ప్రచారానికి వాడుకుంటున్నారని జేడీయూ అధినేత అన్నారు. నితీష్ తన ప్రసంగంలో సీనియర్ మంత్రి బిజేంద్ర యాదవ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనకు విద్యుత్తు రంగంపై దాదాపు 2 దశాబ్దాల అనుభవం ఉందని అన్నారు. ఆయన మంత్ర అయ్యాక రాష్ట్రంలో కరెంటు సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. పట్నాలో కూడా పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. రోజుకి 8 గంటల కరెంటే వస్తుందని తన అత్తమామల నుంచి ఫిర్యాదులు వచ్చేవని.. ఇప్పుడు మొత్తం మారిందన్నారు.

# కృషి భవన్ నుంచి ‘రన్ ఫర్ యూనిటీ’ని జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ పురుషోత్తం రూపాలా

న్యూఢిల్లీ, నవంబర్ 2:సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతి సందర్భంగా, కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి శ్రీ పురుషోత్తం రూపాలా ఈ రోజు కృషి భవన్ ఆవరణ నుంచి ‘రన్ ఫర్ యూనిటీ’ని జెండా ఊపి ప్రారంభించారు. సహాయ మంత్రులు డా. సంజీవ్ కుమార్ బల్యాన్, డా. ఎల్. మురుగన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

”దేశ సమగ్రతకు, పాడి పరిశ్రమ సహకార రంగానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సహకారాన్ని దేశం ఎప్పుడూ గుర్తుంచుకుంటుంది, మనకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటుంది” అని శ్రీ పురుషోత్తం రూపాలా చెప్పారు.

రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యత దినోత్సవం) సందర్భంగా, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ కార్యదర్శి శ్రీమతి అల్కా ఉపాధ్యాయ, మత్స్య శాఖ కార్యదర్శి డా. అభిలాక్ష్ లిఖి సమక్షంలో మంత్రిత్వ శాఖకు చెందిన 150 మంది అధికారులు ‘రన్ ఫర్ యూనిటీ’లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కృషి భవన్ ఆవరణ నుంచి హైదరాబాద్ హౌస్ వరకు ఈ నడక కొనసాగింది.

మన దేశ ఐక్యత, సమగ్రత, అంతర్గత భద్రతను పరిరక్షిస్తామంటూ అధికారులు రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఆ తర్వాత ‘రన్ ఫర్ యూనిటీ’లో పాల్గొన్నారు.




# సాహిత్య.. సంగీత నగరాలుగా కోళికోడ్..

## గ్వాలియర్ యునెస్కో సృజనాత్మక నగరాల నెట్‌వర్క్‌లో చేరడంపై ప్రధానమంత్రి ప్రశంసలు

న్యూఢిల్లీ, నవంబర్ 2:భారతదేశంలోని కోళికోడ్, గ్వాలియర్ సాహిత్య/సంగీత నగరాలుగా యునెస్కో సృజనాత్మక నగరాల నెట్‌వర్క్‌లో స్థానం సంపాదించడంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు అద్భుత ప్రతిష్ట పొందిన కోళికోడ్, గ్వాలియర్ నగరాల ప్రజలకు శ్రీ మోదీ అభినందనలు తెలిపారు.

కోళికోడ్ నగరానికిగల గొప్ప సాహిత్య వారసత్వం ద్వారా భారత సాంస్కృతిక చైతన్యం ప్రపంచ వేదికపై వెలుగుజిలుగులు విరజిమ్ముతున్నదని ఆయన కొనియాడారు. అదేవిధంగా తన సంగీత వారసత్వ పరిరక్షణతోపాటు దాన్ని మరింత సుసంపన్నం చేయడంలో గ్వాలియర్ నిబద్ధత ప్రశంసనీయమని, అది ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తోందని ప్రధాని పేర్కొన్నారు.

ఈ అంశంపై కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి 'ఎక్స్' ద్వారా పంపిన సందేశాన్ని ఉటంకిస్తూ పంపిన తన సందేశంలో:

"ఘనమైన కోళికోడ్ సాహితీ వారసత్వం, గ్వాలియర్ మధుర సంగీత వారసత్వం నేడు గౌరవనీయ యునెస్కో సృజనాత్మక నగరాల నెట్‌వర్క్‌లో భాగమైంది. తద్వారా భారత సాంస్కృతిక వైభవం జగజ్జేగీయమానం కాగలదు. ఈ అద్భుత ప్రతిష్టను సొంతం చేసుకున్న కోళికోడ్, గ్వాలియర్ నగరాల ప్రజలకు నా అభినందనలు! ఈ అంతర్జాతీయ గుర్తింపుతో మనం హర్షిస్తున్న నేపథ్యంలో మన విభిన్న సంస్కృతిసంప్రదాయాల పరిరక్షణ, ప్రోత్సాహం దిశగా దేశం తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తోంది. ఈ ప్రశంసలు మన ప్రత్యేక సాంస్కృతిక గాథలను మరింతగా పంచుకోవడానికి అంకితమైన ప్రతి వ్యక్తి చేసే కృషినీ ప్రతిబింబిస్తాయి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

అలాగే "సాహిత్యంపై కోళికోడ్ అభిరుచి యునెస్కో 'సిటీ ఆఫ్ లిటరేచర్' పురస్కారంతో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. శక్తిమంతమైన సాహితీ సంప్రదాయంతో ఈ నగరం కథా సంవిధానంలో తన ప్రత్యేకతను చాటుకుంది. కోళికోడ్‌కు సాహిత్యంపైగల ప్రగాఢ ప్రేమానురాగాలు విశ్వవ్యాప్త రచయితలు, పాఠకులకు స్ఫూర్తినిస్తాయి" అని కోళికోడ్ నగరాన్ని, అక్కడి ప్రజలను, రచయితలను ప్రధాని ప్రశంసించారు.

అదేవిధంగా- "గ్వాలియర్ నగరానికి, సంగీతంతో ఎంతో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో యునెస్కో నుంచి అత్యున్నత గౌరవం లభించడం గర్వించదగిన ఘనత. గ్వాలియర్ తన సంగీత వారసత్వాన్ని సంరక్షించుకుంటూ, సుసంపన్నం చేయడంలో చూపిన నిబద్ధత నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది. ఈ నగర సంగీత సంప్రదాయం, దానిపై ప్రజలకుగల అనురక్తి, ఉత్సాహం మరింత పెరిగి, భవిష్యత్తరాలు దీన్నుంచి స్ఫూర్తి పొందాలని కోరుకుంటున్నాను" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# ఈనెల 7న తెలంగాణకు ప్రధాని మోదీ

హైదరాబాద్, నవంబర్ 2:ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు రానున్నారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల ప్రచార నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణకు వస్తున్నారు. ఈనెల 7, 11 తేదీల్లో భాజపా నిర్వహించే సభల్లో పాల్గొననున్నారు.

ఈ తేదీల్లో హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో సభలు నిర్వహించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రణాళిక చేస్తోంది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మోదీ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన తరువాత రాష్ట్రానికి ప్రధాని రానుండటం ఇదే తొలిసారి.

# మీ విజయం యావత్ దేశానికి స్ఫూర్తినిస్తుంది మరియు పౌరులను గర్వపడేలా కూడా చేస్తుంది-ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 2:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు న్యూ ఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో భారతదేశపు ఆసియా పారా గేమ్స్ బృందంతో సంభాషించారు. మరియు ప్రసంగించారు. ఆసియన్ పారా గేమ్స్ 2022లో అత్యుత్తమ విజయాలు సాధించిన క్రీడాకారులను అభినందించేందుకు, భవిష్యత్తులో జరిగే పోటీల కోసం వారిని ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు.

పారా అథ్లెట్లను ఉద్దేశించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, వారిని కలవడానికి, వారి అనుభవాలను పంచుకోవడానికి తాను ఎదురు చూస్తున్నానని అన్నారు. "మీరు ఇక్కడికి వచ్చినప్పుడల్లా కొత్త ఆశలు, నూతన ఉత్సాహాన్ని మీ వెంట తీసుకువస్తారు", అని ప్రధాన మంత్రి అన్నారు. తాను ఒక్క విషయం కోసం మాత్రమే ఇక్కడకు వచ్చానని, పారా అథ్లెట్ల విజయాలను అభినందించడమేనని ఉద్ఘాటించారు. పారా ఏషియన్ గేమ్స్‌లో ఫలితాలను తాను చాలా దగ్గరగా అనుసరించడమే కాకుండా వాటిలో మమేకమయ్యానని ప్రధాని తెలిపారు. క్రీడాకారులు వహించిన పాత్రను, వారి సహకారాన్ని ప్రశంసించారు. వారి కోచ్‌లను, వారి కుటుంబాలను కూడా అభినందించాడు. దేశంలోని 140 కోట్ల మంది పౌరుల తరపున శ్రీ మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలలో నెలకొనే అత్యంత పోటీతత్వ స్వభావాన్ని తెలియజేస్తూ, ప్రధాన మంత్రి అథ్లెట్లు ఒకరితో ఒకరు పోటీపడుతుండగా వారిలోని అంతర్గత పోటీపై కూడా దృష్టి పెట్టారు. అథ్లెట్ల అత్యున్నత స్థాయి సాధన, అంకితభావాన్ని ప్రధాని ప్రశంసించారు. "మీరంతా ఇక్కడ ఉన్నారు, కొందరు విజేతలుగా తిరిగి వచ్చారు, మరికొందరు తెలివైనవారు కానీ ఎవరూ ఓడిపోయి తిరిగి రాలేదు" అని ప్రధాన మంత్రి అన్నారు. "క్రీడలలో ఓడిపోవడం లేదు, గెలవడం లేదా నేర్చుకోవడం మాత్రమే'', క్రీడలలో ఉండే అభ్యాస ప్రక్రియను హైలైట్ చేస్తున్నప్పుడు ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. 140 కోట్ల మంది పౌరుల నుంచి ఎంపిక కావడం పారా అథ్లెట్లకు దక్కిన భారీ విజయంగా ఆయన పేర్కొన్నారు. మొత్తం పతకాల సంఖ్య 111 సాధించి రికార్డు బద్దలు కొట్టడం. "మీ విజయం యావత్ దేశానికి స్ఫూర్తినిస్తుంది, పౌరులలో గర్వించదగిన అనుభూతిని కలిగిస్తుంది" అని శ్రీ మోదీ అన్నారు,

అథ్లెట్ల రికార్డు బద్దలు కొడుతూ ప్రదర్శించిన ఆట తీరు పై ప్రధాని స్పందిస్తూ.. గుజరాత్ నుండి లోక్‌సభలో రికార్డు స్థాయిలో ఎన్నికల విజయం సాధించిన సందర్భంగా శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి తనను అభినందించినప్పుడు అనుభూతిని గుర్తు చేసుకున్నారు. ఈ 111 పతకాలు కేవలం అంకెలే కాదు 140 కోట్ల కలలు అని ఆయన అన్నారు. 2014లో సాధించిన పతకాల కంటే ఇది మూడు రెట్లు ఎక్కువ కాగా, బంగారు పతకాల సంఖ్య పది రెట్లు ఎక్కువని, పతకాల పట్టికలో భారత్ 15వ స్థానం నుంచి టాప్ 5కి చేరుకుందని ఆయన తెలియజేశారు.

గత కొన్ని నెలలుగా క్రీడా రంగంలో భారతదేశం సాధించిన విజయాలను ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావిస్తూ, "పారా ఏషియన్ గేమ్స్‌లో మీ విజయం ప్రశంసనీయం'' అని అన్నారు. ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం, ఆసియా క్రీడల్లో బ్యాడ్మింటన్ పురుషుల జట్టుకు తొలి బంగారు పతకం, టేబుల్ టెన్నిస్‌లో మహిళల పెయిర్ తొలి పతకం, పురుషుల బ్యాడ్మింటన్ జట్టు థామస్ కప్ విజయం, 28 స్వర్ణాలతో సహా 107 పతకాలను, ఆసియా గేమ్స్‌లో పతకాలు, ఆసియా పారా గేమ్స్‌లో అత్యంత విజయవంతమైన పతకాలు. సాధించడాన్ని వరుసగా ప్రస్తావించారు.

పారా గేమ్‌ల విశిష్టతను చెబుతూ, దివ్యాంగుల క్రీడా విజయం క్రీడల్లోనే స్ఫూర్తిని పొందే అంశం కాదని, అది జీవితంలోనే స్ఫూర్తిదాయకమని అన్నారు. ఒక క్రీడా సమాజంగా భారతదేశం పురోగతిని, దాని క్రీడా సంస్కృతిని ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. "మేము 2030 యూత్ ఒలింపిక్స్, 2036 ఒలింపిక్స్ నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నాము" అని ప్రధాని తెలిపారు.

క్రీడల్లో షార్ట్‌కట్‌లు లేవని, క్రీడాకారులు తమ సొంత సామర్థ్యాలపై ఆధారపడతారని, అయితే ఒక చిన్న సహాయం దాని ప్రభావాన్ని గణనీయంగా చూపుతుందని ప్రధాని అన్నారు. కుటుంబాలు, సమాజం, సంస్థలు, ఇతర సహాయక పర్యావరణ వ్యవస్థల సమిష్టి మద్దతు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. కుటుంబాల్లో క్రీడల పట్ల దృక్పథాన్ని మార్చుకోవాలని పేర్కొన్నారు.

"మునుపటి కాలం వలె కాకుండా సమాజం క్రీడలను ఒక వృత్తిగా గుర్తించడం ప్రారంభించింది" అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం 'ప్రభుత్వం కోసం క్రీడాకారులు' నుండి 'అథ్లెట్ల కోసం ప్రభుత్వం'గా మారుతున్న విధానాన్ని ఆయన ఎత్తిచూపారు. అథ్లెట్ల విజయం పట్ల ప్రభుత్వ సున్నితత్వాన్ని ఆయన అభివర్ణించారు. "అథ్లెట్ల కలలు, పోరాటాలను ప్రభుత్వం గుర్తించినప్పుడు, దాని ప్రభావం దాని విధానాలు, ఆలోచనలలో చూడవచ్చు" అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. గత ప్రభుత్వాలు క్రీడాకారులకు ఎలాంటి విధానాలు, మౌలిక సదుపాయాలు, కోచింగ్ సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందించ లేదని, ఇది విజయానికి పెద్ద అవరోధంగా మారిందని ఆయన వాపోయారు. గడిచిన 9 సంవత్సరాలలో, దేశం పాత పద్ధతి నుండి, బయటికి వచ్చి ఎదిగిందని ప్రధాన మంత్రి అన్నారు. నేడు వివిధ క్రీడాకారులకు 4-5 కోట్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. "ప్రభుత్వ విధానం నేడు క్రీడాకారుల కేంద్రీకృతం చేస్తోంది'', అది అడ్డంకులను తొలగిస్తోందని మరియు వారికి కొత్త అవకాశాలను సృష్టిస్తోందని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. "పొటెన్షియల్ ప్లస్ ప్లాట్‌ఫాం పనితీరుకు సమానం. సంభావ్యత అవసరమైన ప్లాట్‌ఫారమ్‌ను కనుగొన్నప్పుడు పనితీరు మరింత ఊపందుకుంటుంది", అని అతను వ్యాఖ్యానించారు. ఖేలో ఇండియా స్కీమ్‌ను ప్రస్తావిస్తు, ఇది అథ్లెట్లను అట్టడుగు స్థాయిలలో గుర్తించడం, వారి ప్రతిభను వెలికితీయడం ద్వారా వారిని విజయానికి మార్గం వేసిందని అన్నారు. టాప్స్ చొరవ, వికలాంగుల క్రీడా శిక్షణా కేంద్రం గురించి కూడా ప్రస్తావించారు.

అథ్లెట్లు కష్టనష్టాలను ఎదుర్కుంటూ నిలదొక్కుకోవడమే దేశానికి వారు అందించిన గొప్ప సహకారం అని ప్రధాన మంత్రి అన్నారు. మీరు అధిగమించలేని అడ్డంకులను అధిగమించారని ఆయన అన్నారు. ఈ స్ఫూర్తి అన్ని చోట్లా గుర్తింపు పొందింది, సామాజిక మాధ్యమాల వేదికలపై పారా అథ్లెట్ల ప్రశంసలను ప్రధాని ప్రస్తావించారు. సమాజంలోని ప్రతి వర్గం పారా అథ్లెట్ల నుంచి స్ఫూర్తి పొందుతోంది. "ప్రతి టోర్నీలో మీ భాగస్వామ్యం మానవ కలల విజయం. ఇది మీ అతిపెద్ద వారసత్వం. అందుకే మీరు ఇలా కష్టపడి దేశాన్ని గర్వపడేలా చేస్తారని నాకు నమ్మకం ఉంది. మా ప్రభుత్వం మీ వెంట ఉంది, దేశం మీ వెంట ఉంది" అని ప్రధాన మంత్రి అన్నారు.

ఒక దేశంగా మనం ఏ మైలురాయి వద్ద ఆగిపోమని, మన సన్మానాలపై విశ్రాంతి తీసుకుంటామని ఆయన అన్నారు. "మనం టాప్ 5 ఆర్థిక వ్యవస్థలలోకి చేరుకున్నాము, ఈ దశాబ్దంలో మనం టాప్ 3 ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉంటామని, 2047లో ఈ దేశం వికసిత భారత్‌గా మారుతుందని నేను గట్టిగా చెబుతున్నాను" అని ప్రధానమంత్రి ప్రకటించారు.

కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్, భారత పారాలింపిక్స్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి దీపా మాలిక్, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ అర్జున్ ముండా, కేంద్ర యువజన వ్యవహారాలు ఉ క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీ నిసిత్ ప్రమాణిక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేపథ్యం:

భారతదేశం ఆసియా పారా గేమ్స్ 2022లో 29 బంగారు పతకాలతో సహా మొత్తం 111 పతకాలను గెలుచుకుంది. ఆసియా పారా గేమ్స్ 2022లో మొత్తం పతకాల సంఖ్య మునుపటి అత్యుత్తమ ప్రదర్శన (2018లో) కంటే 54% పెరిగింది. ఈ సారి సాధించిన 29 బంగారు పతకాలు 2018లో గెలిచిన దానికంటే దాదాపు రెండు రేట్లు ఎక్కువ.

ఈ కార్యక్రమంలో అథ్లెట్లు, వారి కోచ్‌లు, పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధికారులు, జాతీయ క్రీడా సమాఖ్యల ప్రతినిధులు, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ బిజెపి అభ్యర్థిగా మేకల సారంగపాణి

సికింద్రాబాద్ నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సికింద్రాబాద్ శాసన సభ స్థానానికి బిజెపి అభ్యర్థిగా మేకల సారంగపాణి ని పార్టీ అధిష్టానం ప్రకటించింది.దీనితో నియోజకవర్గం లోని పార్టీ శ్రేనులు పెద్ద ఎత్తున సారంగపాణి నివాసానికి చేరుకొని అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నేత మాజీ ఎంఎల్సి ఎన్,రామచంద్రా రావు ఆయన నివాసానికి చేరుకొని శాలువా కప్పి అభినందనలు తెలిపి స్వీట్లు తినిపించారు.అనంతరం సారంగపాణి వారసిగూడ చౌరస్తాకు ర్యాలీగా బయలుదేరి చౌరస్తా లో కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణ సంచ కాల్చి స్వీట్స్ పంచుకున్నారు.త్వరలో జరుగబోయే ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానాన్ని బిజెపి కైవసం చేసుకుంటుందన్న ధీమాను సారంగపాణి వ్యక్తం చేసారు.ఇప్పటికే బిఆర్ఎస్ అభ్యర్థి పద్మా రావు ప్రచారాని ప్రారంబించగా అడుగడుగునా అతనికి చుక్కేదురవుతుంది.దీనితో సారంగపాణి ప్రజలు తనవెంటే ఉన్నారని తన గెలుపు ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమం లో పార్టీ సేనియర్ నేత కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఢిల్లీతో కొట్లాడుదాం : మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, నవంబర్ 2: వాల్మీకులు రాజకీయంగా ఎదగాలి. వాల్మీకుల అంశాన్ని మొట్టమొదటగా 2007 అక్టోబర్07 వ తేదీన వనపర్తిలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ నాయకుడు కేసీఆర్దృష్టికి తీసుకుని వచ్చామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. గురువారం వాల్మీకులతో జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి మంత్రి నిరంజన్ రెడ్డి, సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకులు ఆంధ్రలో ఎస్టీలుగా, తెలంగాణలో బీసీలుగా ఎలా ఉంటారన్నారు. మనం వీరిని కూడా తెలంగాణ ఏర్పాటు అయిన తరువాత ఎస్టీ జాబితాలో చేర్చాలని చెప్పామన్నారు. అయితే రాజకీయ పరంగా కులాన్ని తీసివేయలన్నా , కలపాలన్న కేంద్రం చేతిలో అధికారం ఉంటుందన్నారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ చెల్లప్ప కమిషన్ ఏర్పాటు చేశారు.అధ్యయనం చేయడానికి ఇంకా సమయం కావాలి అని చెబితే మళ్లీ సమయం పెంచారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని రాష్ట్రం ప్రభుత్వం చట్ట సభల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా కేంద్రంలో చలనం లేదని ఆరోపించారు. ఢిల్లీకి వెళ్లి తెలంగాణను ఎట్లా సాధించుకున్నామో అట్లాగే వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కొట్లాడుదామన్నారు.

# వైసీపీ తప్పుడు ఓట్లను నమోదు చేస్తు, ఉన్న ఓట్లను తొలగిస్తుంది

## -తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమండ్రి నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వైసీపీ తప్పుడు ఓట్లను నమోదు చేస్తు , ఉన్న ఓట్లను తొలగిస్తుందని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. గురువారం నాడు టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..." రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీడీపీ కార్యకర్తలందరూ ఇంటింటికీ వెళ్లి ఓటర్ లిస్ట్ చెక్కు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుంది. అన్ని వర్గాలను అణచివేసే ధోరణికి వైసీపీ ప్రభుత్వం పాల్పడుతుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తప్పుడు విధానాలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో జగన్మోహన్‌రెడ్డి ఓడిపోవడం ఖాయం.. జైలుకెళ్లడం ఖాయం. పవన్ కళ్యాణ్ , లోకేష్, చంద్రబాబు బయటకు రాకూడదని జగన్ లేనిపోని నిబంధనలు పెడుతున్నాడు. జగన్మోహన్‌రెడ్డి బాబాయ్ వివేకా హత్య కేసును జగన్ మేనేజ్ చేస్తున్నారు. కోడికత్తి కేసు వాస్తవాలు బయటకు వస్తాయని అందుచేతనే సాక్ష్యం చెప్పకుండా జగన్ ప్రక్కదారి పట్టిస్తున్నారు.వచ్చే ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుస్తారు" అని గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.

# బడుగు వర్గాలకు పెద్దపీట వేసిన సీఎం జగన్ - సజ్జల

అమరావతి, నవంబర్ 2:ఉన్నత వర్గాల వారి కంటే బుడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేస్తున్న గొప్ప నాయకుడు సీఎం జగన్మోహన్ రెడ్డి అని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. క్యాబినెట్ లో 70% మంది ఇతర కులాల వారు ఉన్నారని, కార్పోరేషన్ చైర్మన్ లు కూడా బలహీన వర్గాలకే ఎక్కువ ఇచ్చారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల అనుగుణంగా సీఎం జగన్ బుడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీలో బేడ జంగం కులాన్ని తిరిగి ఎస్సీ జాబితాలో చేర్చి కేంద్రానికి ముఖ్యమంత్రి జగన్ పంపడాన్ని స్వాగతిస్తూ ఆంధ్రప్రదేశ్ బేడ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలుమర్తి మధు ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం కృతజ్ఞత సభ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారుడు




సజ్జల రామకృష్ణారెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్ పెద్ద మనసు వలన ఎవరికి ఏ సమస్య వచ్చినా భరోసా ఇవ్వగలుగుత ఎన్నామని చెప్పారు. సీఎం జగన్ దగ్గరకు ఎవరు యాచిస్తూ రావాల్సిన అవసరం లేదని, హక్కుగా రావచ్చని తెలిపారు. గత ప్రభుత్వాలు ఎస్సీ, బీసీల అభ్యున్నతి కోసం ఎటువంటి కృషి చేయలేదని, కానీ సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం ఎన్నో సంక్షేమ పథ కాలను అమలు చేశారని తెలిపారు. ఈ మూడు కులాలను ఎస్సీల జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి అందరి వాడని, ప్రతి ఒక్కరూ రాజకీయంగా ఎదగాలన్నదే ఆయన ఆకాంక్ష అని తెలిపారు.

## నాగార్జున సాగర్ బీజేపీలో ముసలం..

# ఆ పార్టీకి రాజీనామా చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇంద్రసేనారెడ్డి



నల్లగొండ, నవంబర్ 2: బీజేపీలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఎన్నో ఏండ్లుగా పార్టీని నమ్ముకున్న వారిని కాదని పారాచూట్ నేతలకు టికెట్స్ ఇస్తుండటంతో ఒక్కొక్కరు ఆ పార్టీని వీడుతున్నారు. తాజాగా నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియాకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రిక్కల ఇంద్రసేనారెడ్డి బీజేపీకి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపారు.ప్రస్తుతం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఉప ఎన్నికల సమయంలో బీజేపీలో చేరిన ఇంద్రసేనారెడ్డి.. ఈ ఎన్నికల్లో ఆయన బీజేపీ పార్టీ నుంచి అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఇంద్రసేనారెడ్డిని కాదని పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి సతీమణి నివేదిత రెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో తీవ్ర నిరాశకు లోనైన ఇంద్రసేనారెడ్డి ఆ పార్టీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు.

# అభివృద్ధి చేస్తా.. అవకాశం ఇవ్వండి

## -భువనగిరి బిజెపి అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి

యదాద్రి భువనగిరి నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) అవకాశం ఇస్తే భువనగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని భువనగిరి బిజెపి అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారం లో భాగంగా ఈ రోజు భువనగిరి పట్టణంలోనీ సంజీవ్ నగర్, హన్మాన్ వాడ, ఆర్ బీ నగర్ , స్టేషన్ గడ్డలలో ఇంటింటికి తిరిగి మలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బిజెపి ని గెలిపించాలన్న భువనగిరి బిజెపి



ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గూడూరు నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి యువతకు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని,, భువనగిరి బిజెపి అభ్యర్థిగా బరిలో ఉన్న తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం భాస్కర్ గారు, కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగరావు, పట్టణ అధ్యక్షులు పాద రాజు ఉమాశంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, విజయ్ భాస్కర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి పంచేద్దుల బలరాం, కౌన్సిలర్ రత్నపురం బలరాం, కవితా నర్సింహ చారి, విజయ్ కుమార్, సుమ వెంకటేష్, బొర్రా రాకేష్, పట్నం శ్రీనివాస్,బిజెవైఎం నాయకులు పట్నం కపిల్,పుల్ల శివ, జిల్లా నాయకులు కోళ్ల బిక్షపతి, రత్నపురం శ్రీశైలం,మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు లావణ్య గారు, వైజయంతి, దొంత సుమిత్ర, ఉదుత భాస్కర్, యాట వెంకటేష్ ,తుమ్మల నగేష్, ఏర్పుల శివ, గిరిధర్ చారి, ఆకుతోట రామకృష్ణ, పల్లేపాటి వేణు, సత్యవతి,రమేష్, నగేష్, కిషన్ జీ,కృష్ణ చారి, రామకృష్ణ,ఉషా కిరణ్, ఉపేందర్, కోల్లోజు సతీష్, సంతోష్, దిలీప్, వేణుమాధవ్,శ్రీను, రవీందం,కిరణ్,శ్రీకాంత్, రాజు,గిరిధర్ ,తదితరులు పాల్గొన్నారు.

# బాల్కొండను బంగారు తునక చేసిన సీఎం కేసీఆర్ : మంత్రి వేముల



నిజామాబాద్, నవంబర్ 2:బాల్కొండను సీఎం కేసీఆర్ బంగారు తునక చేశారు. కాళేశ్వరం జలాలతో జిల్లాలను సస్యశ్యామలం చేశారు. మిషన్ కాకతీయ పథకంలో జిల్లాలోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి.

రూ.వెయ్యి కోట్లతో బాల్కొండ నియోజకవర్గంలో రోడ్లను అద్దంలా చేసుకున్నామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం బాల్కొండలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. బాల్కొండలో పదిహేను వందల డబుల్ బెడ్ రూం ఇండ్లు నర్మించామని మరిన్ని డబుల్ బెడ్ రూం, గృహలక్ష్మి ఇండ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మరో మూడు చోట్ల సబ్‌స్టేషన్‌లు కేటాయించాలన్నారు. కొత్తగా బీడీలు చేసే వారికి పింఛన్ ఇప్పించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

వేల్పూర్‌లో జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలని, భీంగల్ నింబాచల లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ చుట్టుపక్కల పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు.

బాల్కొండ నియోజకవర్గాన్ని బంగారు తునక చేసిన సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యేగా గెలిపించేందుకు మద్దతివ్వండి

## –న్యాయవాదులతో బిఆర్ఎస్ అభ్యర్థి 'చల్మెడ' అభ్యర్థన



రాజన్న సిరిసిల్ల, నవంబర్2:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని బార్ అసోసియేషన్ సభ్యులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బోయినిపల్లి వినోద్ కుమార్ తో కలిసి బీఆరెస్ అభ్యర్థి చల్మెడ నర్సింహారావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పలు విషయాలపై చర్చించారు.

ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ సమాజంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన న్యాయవాద వృత్తి వల్లనే తమ కుటుంబం ఈనాడు ఇంతటి స్థాయికి ఎదిగిందని అన్నారు.

తన తండ్రి స్వయానా న్యాయవాది కావడంతో పాటు న్యాయ శాఖ మంత్రిగా సేవలు అందించడంతో న్యాయవాద కుటుంబం నుంచి వచ్చిన తనకు న్యాయవాదులంటే ఎనలేని గౌరవం ఉందని పేర్కొన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న తనకు ఒక్క అవకాశం ఇస్తే, న్యాయవాదుల కష్టాలు తెలిసిన వాడిగా రాబోయే రోజుల్లో వేములవాడ కోర్టులో పెండింగ్ లో ఉన్న అన్ని రకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, కార్యదర్శి నక్క దివాకర్, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రేగుల దేవేందర్, పురుషోత్తం, చెర్ల ఆనంద్ కుమార్, నర్సింగరావు, అనిల్ కుమార్, సుధాకర్ రెడ్డి, సుజీవన్, కిషోర్ రావు, బొడ్డు ప్రశాంత్, రజనీకాంత్, నాగుల సంపత్ గౌడ్, మహిళ న్యాయవాది అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుతం మీ దగ్గర 2 వేల నోట్లుఉంటే.. ఇలా మార్చుకోండి

## –పోస్ట్ ఆఫీస్ నుంచి ఆర్బీఐకి నగదు పంపుకోవచ్చు

న్యూ ఢిల్లీ నవంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రూ.2 వేలను మార్చుకోవాలని ఆర్బీఐ విధించిన గడువు అక్టోబర్ 7తో ముగిసింది. అయితే నోట్లు మార్చుకునేందుకు ఆర్బీఐమళ్లీ రెండు ఛాన్స్‌లు కల్పించింది. ప్రస్తుతం మీ దగ్గర 2 వేల నోట్లుఉంటే.. పోస్ట్ ఆఫీస్ నుంచి ఆర్బీఐకి నగదు పంపుకోవచ్చు. ద్వారా నగదును పంపవచ్చు. తద్వారా అకౌంట్లో సదరు నగదు జమ అవుతుందని అధికారులు తెలిపారు. లోకల్ ఆఫీసులకు దూరంగా ఉన్న వారికి ఈ ఛాన్స్ కల్పిస్తున్నట్లు ఆర్బీఐ తెలిపింది. దీంతో పాటు ట్రిపుల్ లాక్ రిసెప్టాకిల్ పద్ధతిలో రూ.2 వేలను మార్చుకునే ఛాన్స్ ఉంది. టీఎల్ఆర్దరఖాస్తు నింపి ఆర్బీఐకి పంపిస్తే.. కస్టమర్ అకౌంట్లో మనీ డిపాజిట్ అవుతుంది. ఆర్బీఐ ప్రాంతీయ డైరెక్టర్రోహిత్ దాస్ మాట్లాడుతూ.. ఇన్సూర్డ్ పోస్ట్ ద్వారా నోట్లను పంపితే అమౌంట్ సేఫ్ గా చేరుకుంటుందని.. కస్టమర్లు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదని, క్యూలో నిలబడే బాధలు అంతకన్నాఉండవని అన్నారు.

# స్టేషన్‌లో బీజేపీకి బిగ్ షాక్.. పార్టీకి రాజీనామా చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మదాసు వెంకటేష్

జనగామ, నవంబర్ 2: జిల్లాలోని స్టేషన్ ఘనపూర్‌లో బీజేపీ భారీ షాక్ తగిలింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేక అపసోపాలు పడుతున్న ఆ పార్టీని ఒక్కొక్కరు వీడుతున్నారు. తాజాగా బీజేపీ రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మదాసు వెంకటేష్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం స్టేషన్ ఘనపూర్ బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. 2018లో రాజకీయ అరంగేట్రం చేసిన తాను సొంత డబ్బులతో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశానని తెలిపారు. ఇందిరకు టికెట్ రావడంతో, ఇండిపెండెంట్‌గా పోటీ చేసినట్లు తెలిపారు.



అనంతరం బీజేపీలో చేరినట్లు వివరించారు. నియోజకవర్గంలో 3000 మందికి ఆర్థిక సాయం పార్టీని బలోపేతం చేసేందుకు ఎంతో కష్టపడ్డానని చెప్పారు. బీజేపీ టికెట్ జి.విజయరామారావుకు ఇచ్చేటప్పుడు కనీసం తనకు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగేండ్లుగా గ్రామాల్లో బీజేపీకి పార్టీ గద్దెలు కట్టిస్తే నాకు ఏమీ ఇవ్వకుండా అవమానించిందన్నారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీకి నాకు ఎలాంటి సంబధం లేదని ఇక మళ్లీ బీజేపీలో కొనసాగే ప్రసక్తేలేదన్నారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని వెంకటేష్ తెలిపారు.

# నేడు డెహ్రాడూన్‌లో 4వ జాతీయ ఈ.ఎం.ఆర్.ఎస్ సాంస్కృతిక, సాహిత్య మరియు కళా ఉత్సవ్ - 2023

న్యూఢిల్లీ, నవంబర్ 2:గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ ఈ ఎస్ టీ ఎస్), ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో 4వ జాతీయ ఈ ఎం ఆర్ ఎస్ సాంస్కృతిక, సాహిత్య మరియు కళా ఉత్సవ్ – 2023ని అక్టోబర్ 3 నుండి అక్టోబర్ 6 వరకు నిర్వహిస్తోంది.

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ అర్జున్ ముండా, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి, గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీమతి. రేణుకా సింగ్ సరుత మరియు ఇతర ప్రముఖులు ఈ వేడుకకు విచ్చేయనున్నారు.

నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో దేశవ్యాప్తంగా 1500+ పైగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈ ఎం ఆర్ ఎస్ ) విద్యార్థులు పాల్గొంటారు. ఈ సంవత్సరం కూడా కళా ఉత్సవ్ కార్యక్రమం లో పాఠశాల విద్యార్థులు తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శిస్తారు.

గిరిజనులను ప్రధాన స్రవంతితో అనుసంధానం చేయడం మరియు వివిధ రంగాలలో అభివృద్ధి చెందడానికి సమాన అవకాశాలను పొందడంలో సహాయపడటానికి మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ఈ ఎం ఆర్ ఎస్ సాంస్కృతిక వేడుకలు మరియు క్రీడల పోటీలను నిర్వహిసోంది, గిరిజన విద్యార్థులకు వివిధ ప్రాంతాలలో ఆయా రంగాలలో తమలో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి జాతీయ వేదికను అందిస్తోంది.

ఈ సంవత్సరం ఏకలవ్య విద్యాలయ సంగతన్ సమితి, ఉత్తరాఖండ్ (స్టేట్ ఈ ఎం ఆర్ ఎస్ సొసైటీ) డెహ్రాడూన్‌లోని మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజీలో వేడుకను నిర్వహిస్తుంది.ఈ ఎం ఆర్ ఎస్ అనేది భారతీయ గిరిజనుల (షెడ్యూల్డ్ తెగలు) కోసం భారతదేశం అంతటా ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలల కోసం భారత ప్రభుత్వ పథకం. ఇది భారత ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ యొక్క ప్రధాన జోక్యాలలో ఒకటి. ఇది మారుమూల గిరిజన ప్రాంతాలలో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి 2018–19లో పునరుద్ధరించబడింది.

# గంజాయి నివారింపుపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి

## –జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## –32.754 కేజీల గంజాయి కాల్చివేత

రాజన్న సిరిసిల్ల, నవంబర్2 :(నేటినిజం ప్రతినిధి): గంజాయి నివారింపుపై పోలిస్ శాఖ ప్రత్యేక దృష్టిజిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ఆ అన్నారు.

సిరిసిల్లలోని రగుడు వద్ద గలా డంప్ యాడ్ నందు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో నమోదు కాబడిన 41 కేసులలో స్వాదీనపరచుకున్న 32 కిలోల 754 గ్రాముల నిషేధిత గంజాయిని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో గురువారం శాస్త్రీయ పద్ధతిలో తగులబెట్టారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్య గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి తమ అమూల్యమైన భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్థవంతంగా నిరోధిస్తున్నారని అన్నారు.

జిల్లాలోని పోలీసుల స్వాధీనంలో ఉన్న మిగతా గంజాయిని



కూడా విడతల వారీగా చట్ట ప్రకారం తగులబెట్టుట జరుగుతుందని తెలియజేసారు. గంజాయి,గుట్కా వంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై పీడీ యాక్టులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

ఎస్పీ వెంట అదనపు చంద్రయ్య,డీఎస్పీ ఉదయ్ రెడ్డి, ఆర్ఐ యాదగిరి, టౌన్ సిఐ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# బెంగళూరులో జికా వైరస్ కలకలం.. అధికారులు హై అలర్ట్

న్యూఢిల్లీ, నవంబర్ 2:కర్ణాటక రాష్ట్రంలో జికా వైరస్ ప్రబలింది. బెంగళూరు అర్బన్ జిల్లాకు సమీపంలో ఉన్న చిక్కబళ్లాపూర్‌లో ప్రాణాంతక జికా వైరస్ బయటపడింది. దీంతో కర్ణాటక వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటీవల కేరళ రాష్ట్రంలో జికా వైరస్ వ్యాప్తి చెందింది. అనంతరం చిక్కబళ్లాపూర్ జిల్లాలోని దోమల్లో జికా వైరస్ గుర్తించారు. దీంతో జికా వైరస్ వ్యాప్తిపై ఇక్కడి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన మొత్తం 100 శాంపిల్స్‌లో ఆరు చిక్కబళ్లాపూర్‌కు చెందినవేనని, అందులో ఐదుగురు నెగిటివ్ కాగా, ఒకరికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిందని చిక్కబళ్లాపూర్ జిల్లా ఆరోగ్య అధికారి (డీహెచ్‌వో) ఎస్ఎస్ మహేష్ తెలిపారు. మరో 30 మంది గర్భిణులు, జ్వరం లక్షణాలతో ఏడుగురి రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం పంపామని, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామని మహేశ్ తెలిపారు.వరుసగా మూడు రోజులుగా జ్వరం ఉన్న వారు ముందుకు వచ్చి రక్త నమూనాలను అందించాలని వైద్యులు కోరారు. చిక్కబళ్లాపూర్ జిల్లాలో ఏడెస్ దోమలు సోకిన దోమలు గుర్తించిన గ్రామానికి 5 కిలోమీటర్ల పరిధిలో సర్వే ప్రారంభించినట్లు డీహెచ్ఓ తెలిపారు. జికా లక్షణాలు డెంగీ జ్వర లక్షణాల మాదిరిగానే ఉంటాయని వైద్యాధికారులు చెప్పారు. జికా వైరస్ వెలుగుచూసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.


**IN THE COURT OF THE MACT CUM 12th. ADDL. CHIEF JUDGE C.C.C AT: SECUNDERABAD**

**O.P.NO. 132 OF 2022**

Between:

C. Lavanya..

…..Petitioner/Petitioner

AND

T.Linga Goud & Others .

...Respondent Respondents

To

R-1. T Linga Goud, S/o Raja Goud Major Occ: Driver, R/o H.No 1-4-516/3 Panchamukhi Hanuman Colony, Kamareddy Nizamabad – 503111

R-2. S Jeevan Kumar, s/o Samel, Major Occ:Business, R/o H.No. 1-73, Advilingal Yellareddy(CT), Kamareddy, Nizamabad – 503122

**NOTICE**

Please take Notice that the Petitioner has filed the above O.P. No.132/2022 for compensation against the Respondents and the above is posted to **06-11-2023** at 10.30. A.M. for your appe arance either in person or throu gh Advo cate. If you are fail to appear on that day this case will be decided in your absence.

(BY ORDER OF THE COURT)

Counsel for Petitioner

**G.ASWINI KUMAR**
**G.VENKAT NAGESEH**
**M.THABITHA**

ADVOCATES

H.No. 12-11-329

WARASIGUDA

SECUNDERABAD

Cell No: 9848145873



**IN THE COURT OF THE MACT CUM 27th. ADDL. CHIEF JUDGE C.C.C AT: SECUNDERABAD**

**O.P.NO. 679 OF 2022**

Between:

G.Narendar Reddy…

..Petitioner/Petitioner

AND

Brahma Chary & Others ...

…..Respondent/ Respondents

To

R-1.Brahma Chary, S/o.Shankaraiah Chary, 35 years, Driver H.No.5-39, Ekmamidi, Nawabpet, Vikarabad- TS-501101

R-2.Khethavath Raju S/o.K.Pulya Business, H.No.9-69/9, Khan Colony, Parigi, Rangareddy, TS-501101

**NOTICE**

Please take Notice that the Petitioner has filed the above O.P.No.679/ 2022 for compensation against the Respon den ts and the above is pos ted to **24-11-2023** at 10.30.A.M. for your appe arance either in person or through Advocate. If you are fail to appear on that day this case will be decided in your abse nce.

(BY ORDER OF THE COURT)

Counsel for Petitioner

**G.ASWINI KUMAR**
**G.VENKAT NAGESEH**
**M.THABITHA**

ADVOCATES

H.No. 12-11-329

WARASIGUDA

SECUNDERABAD

Cell No: 9848145873


# బీఆరెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ గెలుపుకు కలిసికట్టుగా కృషిచేయాలి

## –రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్



రాజన్న సిరిసిల్ల, నవంబర్2:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు నివాసంలో నవంబర్ 6న వేములవాడ పట్టణంలో నిర్వహించబోయే బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగం సమ్మేళనంపై రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్ కుమార్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు అధ్యక్షతన వేములవాడ పట్టణ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ 6వ తేదీన నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తో పాటు మరికొంత మంది ప్రముఖులు హాజరు కానున్నారని, ఈ క్రమంలో ఈ సమ్మేళనానికి పెద్ద ఎత్తున యువకులు, విద్యార్థులు తరలి వచ్చేలా చూడాలని దిశా నిర్దేశం చేశా రు. అట్లాగే వేములవాడ మున్సిపల్ లో కొన్ని చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికి గతంతో పోలిస్తే ఎంతో అభివృద్ధి చెందిందని, ఇటీవలే రాజన్న ఆలయం ముందు రోడ్డు విస్తరణ కొరకు రూ.35 కోట్లు మంజూరయ్యాయని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి వేములవాడ పట్టణాన్ని, దేవాలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే బాధ్యత బిఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని, రాబోయే ఎన్నికల్లో పార్టీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు గెలుపు కొరకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి–రాజులతో పాటు బి.ఆర్.ఎస్ పార్టీ కౌన్సిలర్లు,కో – అప్షన్ సభ్యులు, వార్డ్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సాయంత్రం పూటనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి...

న్యూఢిల్లీ, నవంబర్ 2: కేంద్ర రోడ్డు రవాణాశాఖ 2022 జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన డేటాను విడుదల చేసింది. ఇందులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రమాదాలు ఎక్కువగా సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల మధ్య 94వేలకుపైగా ప్రమాదాలు రికార్డయ్యాయి. ఈ సమయంలో జరిగిన ప్రమాదాలు దేశంలో జరిగిన మొత్తం ప్రమాదాల్లో 20శాతానికిపైగా ఉన్నాయి. అర్ధరాత్రి నుంచి ఉదయం 6 గంటల అత్యల్పంగా ప్రమాదాలు నమోదయ్యాయని నివేదిక తెలిపింది. 2022 సంవత్సరంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య 94,009 రోడ్డు ప్రమాదాలు రికార్డయ్యాయి.

కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలను కలుపుకొని మొత్తం 4,61,312 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఇందులో 1,68,491 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆయా ఘటనలో 4,43,366 మంది గాయపడ్డారు. నివేదిక ప్రకారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య సమయంలో 79,639 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. 2022లో దాదాపు సగం రాష్ట్రాల్లో మరణాల రేటు జాతీయ సగటు 5.2 కంటే ఎక్కువగా ఉందని నివేదిక వెల్లడించింది. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులు 74,897 మంది ప్రాణాలు కోల్పోగా.. 2021 కంటే 7.9 శాతం ఎక్కువ ఉన్నది. 2022లో 19.5 శాతం వాటాతో పాదచారులు రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా బాధితులుగా ఉన్నట్లు నివేదిక వివరించింది.

# కూతురుతో బలవంతంగా పురుగు మందు తాగించిన తండ్రి

తిరువనంతపురం, నవంబర్ 2: క్లాస్‌మేట్‌తో ప్రేమ వ్యవహారం నేపథ్యంలో కూతురుపై తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఐరాన్ రాడ్‌తో ఆమెను కొట్టడంతోపాటు బలవంతంగా పురుగు మందు తాగించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. కేరళలోని కొచ్చీలో ఈ సంఘటన జరిగింది. ఒకే స్కూల్‌లో చదువుతున్న 14 ఏళ్ల బాలిక, 16 ఏళ్ల యువకుడి మధ్య ఉన్న ప్రేమ వ్యవహారం ఆమె తండ్రికి తెలిసింది. దీంతో అతడికి దూరంగా ఉండాలని, ఫోన్‌లో మాట్లాడవద్దని కుమార్తెను హెచ్చరించాడు.

కాగా, అక్టోబర్ 29న ఆదివారం ఆ బాలిక తన ప్రియుడితో మొబైల్ ఫోన్‌లో మాట్లాడింది. గమనించిన తండ్రి దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. మొబైల్ ఫోన్ లాక్కోవడంతోపాటు ఐరన్ రాడ్‌తో కూతుర్ని కొట్టాడు. అంతటితో ఆగక క్రిమి సంహారక మందును బలవంతంగా తాగించాడు. ఆ బాలిక అస్వస్థత చెందగా ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు బాలిక తండ్రి ఆమెతో బలవంతంగా పురుగు మందు తాగించిన విషయాన్ని ఆసుపత్రి వర్గాలు పోలీసులకు తెలిపాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో బాలిక తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యాయత్నం వంటి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కేసీఆర్ సర్కార్‌ను మరోసారి అధికారంలోకి తేవాలి

## –బీఆరెస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, నవంబర్2 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లెలోగురువారం గడప గడపకు గులాబీ జెండా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి బీఆర్ఎస్ మెనిఫెస్టోలో పొందు పరిచిన సంక్షేమ పథకాలు ప్రతి ఓటరుకు వివరించారు.ఈ సందర్భం గా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ బీఆరెస్ పథకాలతో ప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతుందని, మరో సారి'కేసీఆర్ సర్కార్' ను అధికారం లోకి తీసుకువచ్చి, సంక్షేమ పథకాల లబ్ది పొందాలన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి "చల్మెడ" ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మ్యాకల శ్రీనివాస్, సతీష్ రెడ్డి, మొగ్గ అనిల్ కుమార్, కొప్పెర సంతోష్ రెడ్డి, అన్నాడి జనార్దన్ రెడ్డి, ఐత వెంకటేశం, గుడిసె మనోజ్ కుమార్, గుడిసె నరేష్, సిరిసిల్ల శంకర్, సుద్దాల వీరేందర్, చందనం వెంకటేష్, విక్కుర్తి సాయి గౌడ్ పురుషోత్తం, దాసు, సూర ఎల్ల య్య, మిట్టపెల్లి రాజు, గడ్డం మధు, శివకృష్ణ, మొగిలి రమేష్, ప్రకాష్, చిగుర్ల రాజు, చిగుర్ల మహేష్, గుంటి ప్రశాంత్, జిల్లా మధు పాల్గొన్నారు.

# లింగాపూర్‌లో బిజెపి పార్టీకి 50 మంది కార్యకర్తలు రాజీనామా

హైదరాబాద్, నవంబర్ 2: కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బీజేవైఎం నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షులు కమ్మల స్వామి, 50 మంది పార్టీ కార్యకర్తలతో బిజెపి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల నుండి పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేసిన తమకు సరైన గుర్తింపు లేదని ఆవేదన చెందారు.

పార్టీలో కష్టపడే వారికి న్యాయం జరుగుతలేదు అని అన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ఒకటి రెండు రోజుల్లో కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాజీనామా చేసినవారిలో బొంగు చిన్న వెంకన్న, పంజాల రాజు, రమేష్,కడారి విజయ్,కమ్మల శివ, నాయకులు తదితరులు ఉన్నారు.

# ఆ పార్టీ నమ్మించి మోసం చేసింది..

## ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేస్తాం : తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్, నవంబర్ 2: కాంగ్రెస్ పార్టీతో దోస్తీకి సీపీఎం పార్టీ గుడ్ బై చెప్పింది. పొత్తుల విషయంలో కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. స్నేహ ధర్మాన్ని విస్మరించి వామపక్షాలను అవమానించిన కాంగ్రెస్ పార్టీతో పొత్తు లేదని, రెండు రోజుల్లో 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

అనివార్య పరిస్థితుల్లోనే సొంతంగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలువకూడదనేది మా పార్టీ విధానం అన్నారు. సీపీఎం పోటీ చేయని స్థానంలో బీజేపీకి కాకుండా ఇతర అభ్యర్థులకు మద్దతు ఇస్తామన్నారు.


Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.